ప్రజాపక్ష

సమీక్ష

జూలై 16-31, 2003 సమతా పబ్లికేషన్స్ ప్రచురణ వెల : రూ. 5-00

గౌరవ సంపాదకులు :
ఎబికె ప్రసాద్

సంపాదకులు :
వి. హనుమంతరావు

సహాయ సంపాదకులు :
ఇప్ప వీరారెడ్డి

సలహా మండలి :
ప్రొ॥ ఆర్.వి.ఆర్.చంద్రశేఖరరావు
ప్రొ॥ వకుళాభరణం రామకృష్ణ
డి. పాపారావు
బి. సాంబశివరాజు
ఎన్. వేణుగోపాల్

లోపలి పేజీల్లో...

వార్షిక చందా రూ॥ 120/-లు

Edited, Printed and Published by
V. Hanumantha Rao
for Samata Publications
D.No. 8-3-898/22, Road No. 3,
Nagarjuna Nagar,
Hyderabad - 500 073.
Phone : 23748672

Designed & Printed at :
Nutan Art Printers
Lakdi-ka-pool, Hyderabad.

సంపాదకీయం:

బి.జె.పి. 'మేధా మథనం' - కాంగ్రెస్ 'సంకల్పం'

భారతీయ జనతా పార్టీ, జాతీయ కాంగ్రెస్ పార్టీ ఇటీవల ముంబాయి సమీపంలో "ఉద్దాన్"లోనూ, సిమ్లాలోనూ జరుపుకున్న రెండురకాల 'మేధా మథనం' సదస్సుల్లో దేశ ప్రజలకు అందిన సందేశం ఏమిటి? బి.జె.పి. ప్రధానంగా నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్‌లో ప్రధాన భాగస్వామి అయినప్పటికీ అది దేశ ప్రజల పైన రుద్దటానికి అనుసరిస్తున్న విధానాలు మాత్రం దాని మత రాజకీయ సిద్ధాంతం నుంచి బయటపడలేదు. ఒక ప్రధాన జాతీయ ప్రతిపక్షంగా ఇటు జాతీయ కాంగ్రెస్ కూడా ఎంతసేపూ బి.జె.పి. పాలన విధానాలను బలంగా ఎదుర్కోవటానికి భారతీయ ప్రజా బాహుళ్యం మౌలిక ప్రయోజనాలను దేశ స్వతంత్ర ఆర్థిక ప్రతిపత్తిని రక్షించగల స్పష్టమైన ఆర్థిక విధానాలను ప్రకటించటంలో విఫలమవుతోంది. బి.జె.పి., కాంగ్రెస్ పార్టీ రెండూ కూడా తమ తమ 'మేధా మథన' సదస్సుల్లో ఈ కీలకమైన అంశాన్ని దాటవేసి మత రాజకీయాల పట్ల తమ అలౌకిక, లౌకిక విధానాలను అందీ అందకుండా ప్రకటించుకున్నాయి. బి.జె.పి. పైకి ఎన్ని కబుర్లు చెప్తున్నప్పటికీ 'అయోధ్య హింసాతత్వం' నుంచీ, ఫాసిస్టు పరివార పరిధి నుంచీ బయటపడలేకపోతోంది. 'రాజకీయ' బి.జె.పి.కి మతమౌఢ్యంలో గురుస్థానమైన ఆర్.ఎస్.ఎస్. విధానాలకు బి.జె.పి. దూరమవుతున్న దాఖలాలు ఏవీ 'ఉద్ధాన' సదస్సులో కనిపించలేదు. పైగా ఆర్.ఎస్.ఎస్.ను దాని తాలూకు ఇతర "పిల్ల పరివార్‌ల"నూ బుజ్జగించుకుని కేంద్రంలో తన అధికారాన్ని కాపాడుకొనే ఉద్దేశంతో మాత్రమే ఆర్.ఎస్.ఎస్.తో దూరంగా ఉంటున్నట్లు బి.జె.పి. నాటకం ఆడుతోంది. కాని ఈరోజుకీ 'అయోధ్య సమస్య నుంచి, రామాలయ నిర్మాణ సమస్య నుంచి తాను దూరంగా ఉండదలచినట్లు బి.జె.పి. ప్రకటించటం లేదు సరికదా ఇప్పటికే రామాలయ నిర్మాణానికి కట్టుబడే ఉన్నట్టు ఎన్నికల కోసం ప్రకటించుకుంది. ఈ మధ్యలో కంచి పీఠాధిపతిని తమ స్వార్థం కొద్దీ అయోధ్య రాజకీయాల్లోకి దించి బి.జె.పి. అబాసుపాలైంది. ఒకవైపు ప్రధాని వాజ్‌పాయితో మంతనాలు ఆడుతూనే కంచిస్వామి మరోవైపున ఆర్.ఎస్.ఎస్.తో గుసగుసలు ఆడుతూ వచ్చారు. ఆర్.ఎస్.ఎస్. ఏది చెప్పమంటే అదే చెప్పారు స్వామి! ముస్లిం పర్సనల్ 'లా' బోర్డుకు, తనకు మధ్య జరిగిన ఉత్తర, ప్రత్యుత్తరాలలో బయటపడిన అసలు రహస్యం-అయోధ్యలోని వివాదాస్పద స్థలాన్ని (కోర్టు పరిశీలనలో వున్న వివాద స్థలం అంటే మసీదును కూల్చిన స్థలం) ముస్లింలు వదిలేసుకొని హిందువులకు "దానం" చేయాలని 'కంచిస్వామి' సూచించటం! దీనితో కథ మళ్ళీ మొదటికే వచ్చింది. అంతేకాదు, రెండు మతాలవారు సామరస్యంతో బ్రతకాలంటే

ముస్లింలు తమ స్థలాన్ని వదులుకోవాలన్నది 'కంచి'వారి డిమాండూ, కమాండూ. దీన్ని ముస్లిం 'లా' బోర్డు తిరస్కరించింది. గుర్తించవలసిన అసలు సంగతి-కంచిస్వామి తన లేఖల్లో ఎక్కడా కూడ బాబ్రీ మసీదును పనిగట్టుకొని ధ్వంసం చేసిన బి.జె.పి. పరివార ముఠాను మాటమాత్రం గానూ ఖండించటం కాని, లేదా కనీసం విచారం వ్యక్తం చేయటం కాని జరగలేదు.

జాతీయ కాంగ్రెస్ సిమ్లా సదస్సు జాతీయ జీవనంలోని ప్రజాతంత్ర లౌకిక శక్తులన్నింటిని కూడకట్టుకొని బి.జె.పి. మతతత్వ రాజకీయాల పైన ధ్వజమెత్తటానికి స్పష్టమైన నిర్ణయం తీసుకుంది. ఇది శుభ పరిణామం. దేశ సెక్యులర్ వ్యవస్థను పరిరక్షించుకోవటానికి తగిన పునాదిని ఈ నిర్ణయం పటిష్టం చేస్తుంది. ఈవైపుగా తమతో కలిసివచ్చే రాజకీయ పక్షాలూ, ప్రజాతంత్ర శక్తులతో ఎన్నికల సర్దుబాట్లు, ఒప్పందాలు కుదుర్చు కోవటానికి కాంగ్రెస్ సంసిద్ధత వ్యక్తం చేసింది. అయితే, సెక్యులర్ పునాదులు పటిష్టం కావటానికి ఈ సంసిద్ధత ఒక్కటే చాలదు. స్పష్టాతి స్పష్టమైన, ప్రజానుకూలమైన, ఆచరణయుక్తమైన ఆర్థిక విధాన ప్రకటన పైన మాత్రమే సెక్యులర్ వ్యవస్థ ప్రతిష్ట ఆధారపడి వుంటుంది. ప్రపంచ బ్యాంకు సంస్కరణలను ఆహ్వానించిన మొట్ట మొదటి రాజకీయ పక్షం కాంగ్రెస్. "రాజుకు మించిన రాజభక్తి" లాగా ఆ తరువాత అధికారంలోకి వచ్చిన యునైటెడ్ ఫ్రంట్, బి.జె.ఫి. ప్రభుత్వాలు తప్పుడు ప్రజావ్యతిరేక సంస్కరణలను భుజాన వేసుకొని మరింత ముందుకు నడిచి దేశాన్ని భ్రష్టు పట్టిస్తూ వచ్చాయి. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ తన ఆర్థిక విధాన ఎజెండాను తిరగదోడుకొని కనీసం గతంలోని మిశ్రమ ఆర్థిక వ్యవస్థనైనా పునరుద్ధరించకపోతే, ప్రభుత్వరంగ వ్యవస్థను కాపాడకపోతే, ప్రపంచ బ్యాంకు సంస్కరణల రథచక్రాల క్రింద మొత్తం దేశ ఆర్థికరంగ పునాదులు దెబ్బతినిపోతాయి. ప్రభుత్వ రంగం లేకుండా ప్రైవేటురంగ పురోగతి అసాధ్యం. పెట్టుబడిదారీ దేశాలు సహా అన్నిదేశాల చరిత్రా, ఈ విషయాన్నే, ఈ సత్యాన్నే నిరూపించింది. 1930ల నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి, ఆ తరువాత రెండవ ప్రపంచ యుద్ధానంతరం దుస్థితికి పరిష్కార మార్గంగా ఆయా దేశాల ప్రభుత్వ రంగాల ఆర్థిక ప్రణాళికలు, కార్యక్రమాలే జీవనాధారాలు అయ్యాయని కాంగ్రెస్ మరచిపోకూడదు. ○

రెండు రెళ్ళ నాలుగు

దేశం	శిశు మరణాల రేటు వెయ్యికి	ఐదు సం॥ల సం॥ల లోపు పిల్లల మరణాల రేటు	బాలింత మరణాల రేటు లక్షకి	60 సం॥లు దాటక ముందే చని పోయేవారు (%)	సగటు జీవిత కాలం
1	2	3	4	5	6
జపాన్	4	5	18	8	80
ఇంగ్లాండ్	6	7	9	10	77
అమెరికా	7	8	12	13	77
క్యూబా	7	8	95	13	76
రష్యా	17	20	75	30	67
చైనా	31	36	95	18	70
పాక్	91	120	340	27	62
శ్రీలంక	16.	18	140	15	74
భారత్	70	108	570	30	63

ఆధారం : హ్యూమన్ డెవలప్మెంట్ రిపోర్ట్-1999. వరల్డ్ డెవలప్మెంట్ రిపోర్ట్ 2000/2001

క్రమ సంఖ్య	పంచవర్ష ప్రణాళికా కాలం	మొత్తం ప్రణాళికా వ్యయం రూ. (కోట్లలో)	ఆరోగ్యానికి కేటాయించిన మొత్తం కేంద్రం-రాష్ట్రం	
			రూ. (కోట్లలో)	మొత్తం ప్రణాళికా వ్యయంలో శాతం
1.	మొదటి ప్రణాళిక (1957-56)	1960.00	65.200	3.33
2.	రెండవ ప్రణాళిక (1956-61)	4672.00	140.80	3.01
3.	మూడవ ప్రణాళిక (1961-66)	8576.50	225.90	2.63
*	వార్షిక ప్రణాళిక (1966-69	6625.40	140.20	2.12
4.	నాల్గవ ప్రణాళిక (1969-74)	15778.80	335.50	2.13
5.	ఐదవ ప్రణాళిక (1974-79)	39.426.20	760.80	1.93
*	వార్షిక ప్రణాళిక (1979-80)	12.176.50	223.10	1.83
6.	ఆరవ ప్రణాళిక (1980-85)	1.09.291.70	2025.10	1.85
7.	ఏడవ ప్రణాళిక (1985-90)	2.18.729.60	3688.60	1.69
*	వార్షిక ప్రణాళిక (1990-92)	1.27.373.90	2003.1	1.57
8.	ఎనిమిదవ ప్రణాళిక (1992-97)	4.34.100.00	7582.20	1.75
9.	తొమ్మిదవ ప్రణాళిక (1997-2002)	8.59.200.00	5.118.19	0.59

ఆధారం : నైన్త్ ఫైవ్ ఇయర్‌ప్లాన్ వాల్యూమ్-II

మత్తులో గమ్మత్తు చేస్తున్న ముఖ్యమంత్రి

తెలుగుదేశం పార్టీకి, ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే ముఖ్య మంత్రికి ఇపుడు ఒకేఒక లక్ష్యం. అది వచ్చే ఎన్నికల్లో గెలిచి తిరిగి అధికారంలోకి రావటం. ఆ లక్ష్యం నెరవేర్చుకోవడానికి ఏమి చేయడానికైనా వెనుదీయరు. తిరుపతి తిరునాళ్ళకు ముందే కోటివరాలిచ్చి, వారం రోజుల్లోనే పార్టీ లక్ష్యానికి ప్రభుత్వ ఆమోద ముద్ర వేసుకొని శరవేగంతో 19వ జన్మభూమి వేదికను ఉపయోగించుకొని ఆ పథకాలను అమలుచేయటం ప్రారంభించింది. కోటి విజ్ఞప్తులు జన్మభూమికి చేరాయంటే ప్రజలు సమస్యల వలయంలో ఎంతగా కూరుకొనిపోయారో అర్థమవుతుంది.

ఈ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి ఆల్మట్టి అన్నారు. తర్వాత పరగోడు అన్నారు. ఇపుడు ఈనాటియుద్ధం రాష్ట్ర సరిహద్దుల్లోపలనే. రెండు జిల్లాల మధ్య రాజోలిబండ ప్రాజెక్టుమీదకు మళ్ళించారు. కర్నాటకతో ప్రకటనల యుద్ధం, కేంద్రంతో ఉత్తరాల యుద్ధం ప్రారంభించారు. ముఖ్యమంత్రి ప్రధానిపై ఉత్తరాలబాణాలు విసురుతున్నారు. ప్రజల దృష్టిని సమస్యల నుంచి మరల్చటం చాప కింద నీరులా సాగుతుంది. మరో రెండు ప్రయత్నాలు. మద్యం షాపులను, బెల్టుదుకాణాలను విచ్చలవిడిగా అనుమతించటం ఒకటి. తాగి పడివుంటారు. ఆ మత్తులో ఏ అఘాయిత్యాల నైనా చేయవచ్చు, చేయించవచ్చు. ఎక్సైజ్ సుంకం వసూళ్ళు తారాజువ్వలా ఆకాశంలో విహరిస్తున్నాయి. తాజా అంచనా రెండువేల కోట్ల రూపాయల పైమాటే. ఆదాయం ఇంకా పెంచాలని అధికారులకు కోటాలు ఇచ్చి పూర్తిచేయాలని తొందరపెడుతున్నారని వార్తలు. జనం తాగి మత్తులో పడివుండటమే పాలకులకు కావాల్సింది.

ఈ మత్తు చాలదన్నట్లు, భక్తి మత్తును కూడా విస్తరించే కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలోనూ ఓ గుడి కట్టిస్తారట. ఇప్పటికే దేవాలయమో, లేదా ఎల్లమ్మ లేక మైసమ్మ గుడో లేని గ్రామం లేదు. అయినా, వాటిని ఇంకా విస్తరిస్తారట. గ్రామంలో దళితవాడల్లో వాటిని నెలకొల్పుతారట. దీనితో ఓటుబ్యాంకు పదిలమవుతుంది. అదే సమయంలో మాలమాదిగలు వచ్చి ఊళ్ళో గుడిని "మైల"పరచకుండా వుంచడమూ అవుతూంది. భక్తిమత్తులో పడి సమస్యల్ని మర్చిపోతారు. గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు పోతోందో లేదో కాని, ఈ రెండురకాల మత్తులో జనం పడివుంటే ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని ఈ "అలగా"జనం అల్లర్లు చేయకుండా ముందుకు తీసుకొనిపోతారు. బుర్ర పాదరసంలా పని చేస్తుం దంటారు ఇదే.

* * *

కాంట్రాక్టు వ్యవసాయం గురించి తరచుగా వింటున్నాం. కార్పొరేట్ సంస్థలు, విదేశీ కంపెనీలు చిన్న, సన్నకారు రైతులను వ్యక్తిగతంగా, లేదా గ్రామానికి గ్రామాన్నే గుత్తకు తీసుకొని వారికి కావాల్సిన పంటలను వారిచేతే పండించి కొనుక్కోవటం జరుగుతుంది. ఆ రైతుకు కావాల్సిన విత్తనాలు, ఆర్థిక సహాయం, పండించిన పంటను ఒక నిర్ణీత ధరకు హామీ ఆ కంపెనీ ఇస్తుంది. పడుతూ లేస్తూ చాలా కష్టంగా వ్యవసాయం చేస్తున్న చిన్న, సన్నకారు రైతులకు ఇది ఆకర్షణీయంగానే కనపడుతుంది. కాని ఆచరణలో రైతు తన పొలంలో తానే వ్యవసాయ కూలీగా మారిపోతాడని, కంపెనీలు కొరడా విదిల్చి వారిమీద పెత్తనం సాగిస్తారని, ఆయా ప్రభుత్వాలు కూడా కంపెనీలకే వత్తాసు పలుకుతాయని పంజాబ్ అనుభవం చెబుతోంది. బాస్మతి బియ్యం పంటకు పంజాబ్ ప్రసిద్ధి. కాంట్రాక్టు ఒప్పందంలో పంటకు ఇంతరేటు ఇస్తాం అని వుంటుంది. కాని ఈరేటు మంచి సీజన్‌లో ఇచ్చే రేటుకన్నా తక్కువగానే వుంటుంది. మార్కెట్‌లో మంచిధర పలుకుతుందని అక్కడ అమ్ముకోవడానికి వీలులేదు. కాంట్రాక్టు కుదుర్చుకునే ముందు ప్రతి రైతు నూరు రూపాయలు చెల్లించి రిజిస్టరు చేసుకోవాలి. ఇప్పుడు అక్కడి రైతులు లబోదిబో అంటున్నారు. మన రాష్ట్రంలో ప్రతి పంచదార కర్మాగారానికి ఒక జోన్‌ను ఏర్పాటుచేసి ఆ పరిధిలో చెరుకు పండించే రైతులంతా ఆ కర్మాగారానికే చెరుకు తోలాలనే నిబంధన వుంది. కాని చెరుకు సరఫరా అపుడపుడు అడ్డదారులు తొక్కుతుంటుంది. అయినా, వాళ్ళను తలతీసి మొలెయ్యరు. కాని పంజాబ్‌లో, గ్రామంలో ఒక్క రైతు తన ఉత్పత్తిని సరఫరా చేయకపోతే, ఆ బహుళజాతిసంస్థ మొత్తం గ్రామాన్నే శిక్షిస్తుంది. ఆంధ్ర రైతులారా, బహుపరాక్! ○

వైద్యరంగం ప్రైవేటీకరణల్లో భాగమే ఈ పసిపిల్లల మరణాలు

- ఇ.పి.ఎస్.పి. దర్శిని

రాష్ట్రంలో అనేక జిల్లాలు విషజ్వరాలతో వణికిపోతున్నాయి. అభం శుభం తెలియని పనివాళ్ళు ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలై పోతున్నారు. చనిపోయిన పిల్లలంతా పేద కుటుంబాల నుంచి వచ్చినవారే. ధనిక, మధ్య కుటుంబాల నుంచి ఎవరూ చనిపోలేదు. పేదరికమే ఈ మరణాలకు కారణమని ఇంతకన్నా రుజువు అక్కర లేదు. పేదరికం ప్రభుత్వ విధానాల ఫలితం కాబట్టి ఈ ప్రభుత్వాన్ని ఈ ముఖ్యమంత్రిని ప్రజల కోర్టులు దోషులుగా నిలబెట్టాలి.

ప్రబలుతున్న అంటురోగాలకు, పసిపిల్లల మరణాలకు ఈగలు, దోమలు, పందులు, పారిశుధ్య లోపంగా ప్రభుత్వం చెప్పడం బాగానే వుంది. కానీ గత ఏడేళ్ళుగా వేలకోట్ల రూపాయల ఖర్చుతో నిర్వహిస్తున్న 'పారిశుధ్యం-పచ్చదనం' కార్యక్రమం ద్వారా ఏం సాధించినట్లు? పారిశుధ్యం అనేది నేరుగా రాజధాని నగరం హైదరాబాద్ లోనే, ప్రధాన వీధుల నుంచి కాస్త లోపలికి వెళితే, కనపడని వస్తువు. ఈ పరిస్థితి ముఖ్యమంత్రే స్వయంగా బస్తీలకు ఆకస్మిక తనిఖీ చేసినపుడు కనబడింది. హైదరాబాద్‌లోనే ఇలావుంటే గ్రామాల్లో ముఖ్యంగా దళితులు నివసించే గూడాల్లో కనబడేది పూర్తిగా మురికికూపమే. 'పరిశుభ్రం-పచ్చదనం' కార్యక్రమం ప్రచార హోరులో ఈ పేద ప్రజల విన్నపాలు వేడుకోళ్ళు వినిపించలేదు. రాజ్యాంగ చట్టం ప్రకారం పంచాయతీలకు అందాల్సిన నిధులను అందచేయక పోవటంతో పారిశుధ్యం కార్యక్రమం పంచాయతీల ఎజెండాలోనే లేదు. త్రాగునీటికి మామూలు రోజుల్లోనే ఠికాణా లేదు. అలాంటిది నీటి కరువు తాండవిస్తున్న నేటి పరిస్థితుల్లో ఆ కాసిన్ని నీళ్ళు కూడా లభించక మురికినీరు తాగటం పై కారణాలకు తోడైంది. రోగం వస్తే తట్టుకొని నిలబడగలిగే పోషకాహారం మొదలే లేదు. రోగం వచ్చిందని ఆసుపత్రికి తీసుకొని వెళదామంటే మన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మందులు లేని, మందులుంటే డాక్టర్లు లేని కేంద్రాలుగా మారిపోయాయి. దూరంగా వున్న ఆసుపత్రులకు వెళ్ళాలంటే ప్రయాణపు ఖర్చులు కూడా భరించలేని బతుకులు వాళ్ళవి. ఒకవేళ వెళ్ళగలిగినా, అక్కడ డాక్టర్లున్నా గేటుకాపలా వాడివద్ద నుంచి డాక్టరు వరకూ ముడుపులు చెల్లించుకోలేని బీదరికం. చీమూ, నెత్తురు వున్న ప్రభుత్వమైతే రాజీనామా చేసివుండాలి.

19వ విడత జన్మభూమి ఇంకా రెండుమూడు రోజుల్లో ముగుస్తుందనగా, పిల్లల మరణాల వార్తలు రావటం ప్రారంభించనా ముఖ్యమంత్రి చలించలేదు. చస్తే చావనియ్ పేదపిల్లలే కదా అనుకున్నారో ఏమో, జన్మభూమి తద్దినం పూర్తయ్యేవరకూ ఈ విషవ్యాధి గురించి మాట అయినా మాట్లాడకుండా, అది ఆ తర్వాతే నిద్రనుంచి లేచినట్లు లేచి చిందులు వేయటం ప్రారంభించారు. ఈ పాపాన్ని కడిగేసుకోవడానికా అన్నట్లు, తీరిగ్గా పారిశుధ్య కార్యక్రమాలకు జిల్లాకు రూ. 25 లక్షలు కేటాయించారు. వానాకాలం వస్తూందంటే తీసుకోవలసిన ముందు జాగ్రత్తలు తీసుకొని, తీసుకో లేనంత గుడ్ గవర్నెన్స్ మనది. ముఖ్యమంత్రి చేతులకు అంటుకున్నది మసి కాదు, మట్టి కాదు, పసిపిల్లల రక్తం. ప్రజారోగ్యానికి బాధ్యత వహించాల్సిన ప్రభుత్వమే ఇంత నిర్లక్ష్యంగా ప్రవర్తించినపుడు రేపు వైద్యాన్ని ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు పూర్తిగా ప్రైవేటీకరిస్తే, అపుడు వందలుకాదు వేలల్లో మరణిస్తారు. ఈ ఆరోపణ ఎందుకు చేయాల్సివచ్చిందంటే, ఇంతమంది పిల్లలకు ఇంత పసి వయసులోనే నూరేళ్ళు నిండిపోయి, రాష్ట్రంఅంతటా హాహాకారాలు వినపడుతుంటే, డాక్టర్లుగాని, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గాని, అపోలో లాంటి కార్పోరేట్ ఆసుపత్రులు గాని నోరు మెదపరేం? మేం వున్నాం, మా ఆసుపత్రి నుంచి ఇంతమంది డాక్టర్ల బృందాన్ని పంపించటానికి రెడీగా వున్నాం అనే స్పందనే కరువైందే? విషజ్వరం వచ్చిన పిల్లలకు ఆ వైరస్ ఏమిటని తెలియనపుడు, మేం మాత్రం వెళ్ళి ఏం చేస్తాం అని అనవచ్చు కాని గ్రామాల్లో మిగతా పిల్లలకైనా ముందు జాగ్రత్తగా రక్షిత చర్యలు తీసుకోవచ్చు గదా. 'వైద్యో నారాయణో హరి' అన్నట్లు వైద్యుడు దేవునితో సమానమంటారు. కాని కళ్ళముందే డజన్లకొద్ది పసిపిల్లలు ప్రాణాలు విడుస్తుంటే కనీసం మానవతావాదాన్ని కూడా ప్రదర్శించని వీళ్ళు వైద్య వృత్తికే కళంకాన్ని ఆపాదిస్తున్నారు.

వ్యాధి ఏమిటో తెలియకున్నా ఇదేతరహా వ్యాధుల ద్వారా పసిబిడ్డల ప్రాణనష్టాన్ని అపారంగా చవిచూసిన గత అనుభవం ఆంధ్ర రాష్ట్రానికి ఉంది. 1999లో 'జపనీస్ ఎన్‌సెఫెలైటిస్' అనే క్రిమి ద్వారా విస్తరించిన మెదడువాపు వ్యాధి 203 మంది పసివాళ్ళను బలితీసుకుంది. అత్యధికంగా పిల్లల్ని బలితీసుకుంటున్న ఈ వ్యాధికి ఆంధ్ర రాష్ట్రానిదే అగ్రస్థానం. సాధారణంగా ఈ వ్యాధిక గురైన పిల్లల్లో 33 శాతం మంది చనిపోతారని రికార్డులు చెబుతున్నాయి. వర్షాకాలం లేదా వర్షాల తర్వాత సీజన్‌లలో దోమల ద్వారా వృద్ధిచెందే ఈ వ్యాధిపట్ల ప్రభుత్వం తీసుకున్న చర్యలు హాస్యాస్పదాన్ని, అసంతృప్తిని కలిగిస్తుంటాయి. పిల్లలు చనిపో తున్నారని తల్లిదండ్రులు, పత్రికలు గగ్గోలు పెట్టినప్పుడు మాత్రమే ఆఘమేఘాల మీద ఆ ప్రాంతాలకు వెళ్ళడం, టి.వి. ఛానళ్ళలో హడావిడి చేయడం కనబడుతుంది. ఈ చవకబారు హడావిడి వల్ల కాక సీజన్ మారి దోమల సంఖ్య తగ్గడంతోనే ఈ వ్యాధి కొంత తగ్గుముఖం పడుతుంది. మళ్ళీ అదే కాలానికి పిల్లలు చనిపోతున్నా రంటే తప్ప ప్రభుత్వానికి చలనం రావడంలేదు. సరిగ్గా ఇపుడు కూడా పరిస్థితి అదేవిధంగా వుంది.

1990 నుండి 99 వరకు రాష్ట్రంలో మెదడువాపు వ్యాధితో మృత్యువాత పడిన పిల్లల వివరాలు

సంవత్సరం	1990	1991	1992	1993	1994	1995	1996	1997	1998	1999
కేసులు	667	528	143	1185	260	986	332	984	524	1037
మరణాలు	293	213	66	467	131	169	108	247	201	203

అతిసార వ్యాధితో 1998 చివర్లో ఆదిలాబాద్ జిల్లా వణికి పోయింది. వందలమంది ఆదివాసులు చనిపోయారు. పత్రికలూ, ప్రజాసంఘాలూ ఆయా ప్రాంతాలను సందర్శించి సమస్య తీవ్రతను చాటాక గాని ప్రభుత్వం కదలలేదు. ప్రభుత్వ యంత్రాంగం అక్కడకు వెళ్ళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలనైతే కొంత యాక్టివేట్ చేసింది గాని, అతిసార వ్యాధి ప్రబలటానికి మాత్రం ఆదివాసులనే నిందితుల్ని చేసింది. 'ఆదివాసులు అజ్ఞానులు, వ్యాధులకు చికిత్స చేసుకోవటానికి వారు ఇష్టపడడం లేద'ని ప్రకటించి తమ బాధ్యతను మరుగుపరుచుకుంది.

ఇలా గడిచిన ఐదు సంవత్సరాలలో జరిగిన రెండు దారుణాను భవాలు ఉన్నప్పటికీ ఇలాంటి భయంకర సీజనల్ వ్యాధుల నిర్మూలనలో ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేదు. నిజానికి ఈ వ్యాధులన్ని గ్రామీణ పేద ప్రజానీకాన్ని, ఆదివాసుల్ని, పట్టణ మురికివాడల్లోని వారిపైనే దాడి చేస్తుంటాయి. ఇప్పుడు రాష్ట్రంలో కొనసాగుతున్న పిల్లల అకాల మృత్యు మరణాల వివరాలు ఈ వాస్తవాన్నే బయటపెడుతున్నాయి. చనిపోయిన వారిలో 95 శాతానికి పైగా గ్రామీణ ప్రాంత వాసులేనని మిగతా 5 శాతం పట్టణ మురికివాడల పేద జనాల బిడ్డలేనని తెలుస్తుంది. దీనికి కారణం వారి పేదరికం. దీనితో ముడిపడివున్న కలుషిత నీరు, పౌష్టికాహార లోపం, చాలీచాలని ఇరుకు గదులు, గుడిసెల్లో నివాసం, నిరక్షరాస్యత, ఇట్లాంటి అనేకానేక కారణాలు కనిపిస్తుంటాయి. ఈ కారణాలు కనిపించకపోవడం ప్రభుత్వానికే.

రాష్ట్రంలో అంటువ్యాధుల కారణంగా కలుగుతున్న మరణాల వాటా మొత్తం అనారోగ్య మరణాల వాటాలో 54 శాతాన్ని ఆక్రమిస్తుంది. అంటువ్యాధేతర వ్యాధుల కారణంగా సంభవించే మరణాలు 30 శాతంగా ఉంటున్నాయి. అంతులేని అనారోగ్య రాశినంతా సామాన్యుల వ్యక్తిగతానికి వదిలేసిన ప్రభుత్వం అంటు వ్యాధుల నివారణలోనూ కేవలం నాలుగైదు వ్యాధుల విషయంలోనే తన కార్యక్రమాన్ని నామమాత్రంగా పరిమితం చేసుకుంది. అందులో ప్రధానంగా మలేరియా, బోధకాలు డెంగ్ ఫీవర్, మెదడువాపు వ్యాధులను మాత్రమే తన నిర్మూలనా కార్యక్రమాల్లో చేర్చుకుంది. అయినా ఈనాటికి ఈ వ్యాధులను కూడా అరికట్టడంలో విఫలమై తున్నదనడానికి తగినన్ని ఆధారాలు ఉన్నాయి.

1958లో విదేశీ నిధులలో జాతీయ మలేరియా నిర్మూలనా కార్యక్రమాన్ని ప్రారంభించిన భారత ప్రభుత్వం 1961 నాటికి మలేరియాను అదుపులోకి తేగలిగింది. ఆతరువాత పదేళ్ళదాకా ఒక్క మలేరియా మరణం కూడా నమోదు అయినట్లు వినిపించలేదు. ఈలోగా విదేశీనిధులు ఆగిపోగానే మలేరియా నిర్మూలనా కార్య క్రమాన్ని ప్రభుత్వం నిలిపేసింది. 1974లో మూడుమరణాలతో తిరిగి ప్రారంభమైన మలేరియా వ్యాధి ఈ 29 సంవత్సరాల కాలంలో ఏఏటికాయేడు తన ఉధృతిని పెంచుకుంటూనే వుంది. 1996లో అధికారికంగా మూడవేల మరణాలు సంభవిస్తున్నాయని ప్రభుత్వం ప్రకటించినా అనధికారిక వైద్య సంస్థల సర్వేలు మాత్రం ఏటా 75 వేలమంది ఈ వ్యాధిబారిన పడి మరణిస్తున్నారని చెబు తున్నాయి. ఇది ఆదివాసీప్రాంతాల్లో ఎక్కువగా ఉందని అంటున్నారు.

దక్షిణ మధ్య భారతదేశంలో ఈశాన్య రాష్ట్రాల్లో క్యూలెక్స్ దోమవల్ల అత్యంత వేగంగా వ్యాప్తిచెందుతున్న వ్యాధి ఫైలేరియాసిస్ (బోధకాలు). ఏటా 60 లక్షల మంది ఈ వ్యాధికి గురైతున్నట్లు రికార్డులు చెబుతున్నాయి.

తేటనీటిలో అత్యధికంగా వృద్ధిఅయ్యే ఎడిస్ దోమవల్ల వచ్చే వైరస్ వ్యాధి డెంగ్ ఫీవర్. 1996 అక్టోబర్‌లో దేశ రాజధానిని వణికించిన ఈ దోమ 7242 మందిని తాకి 300 మంది ప్రాణాలను తీసింది.

ఇలాంటి సాంక్రమిక, సాంక్రమికేతర వ్యాధులెన్నింటినో శాశ్వతంగా నివారించడంలో ప్రభుత్వం ఎన్నడో విఫలమైంది. మంచి పారిశుద్ధ్య నిర్మాణాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, రక్షిత మంచినీరు, కాలుష్యరహితమైన గాలీ, విస్తారమైన చెట్లూ, గాలీ వెలుతురూ, మంచి గృహవసతి, కనీస స్థాయిలోనైనా సంపూర్ణ ఆహార లభ్యత అందరికీ ఉండి ఆరోగ్యకరమైన వ్యక్తిగత అలవాట్లను ప్రోత్సహించినట్లయితే ఇలాంటి అనేక భయంకర వ్యాధుల నుండి రక్షణ కల్పించటం ప్రభుత్వానికి అసాధ్యం ఏమి కాదు. అందుకు కావలసింది ప్రజారోగ్యం విషయంలో నిజాయితీ, శ్రద్ధలు. కాని ప్రస్తుతం ప్రజా జీవితాల్ని ప్రమాదభరితం చేస్తున్న సాంక్రమిక, సాంక్రమికేతర వ్యాధుల నిర్మూలనలో ప్రభుత్వ విధానం అందుకు విరుద్ధంగా వుంది. ప్రభుత్వం తను చేయాల్సిన పనిచేయకుండా ప్రజలను వ్యక్తిగత రక్షణ పద్ధతులకి ప్రోత్సహిస్తూ తనేమో పందుల వేట, దోమల వేట, ఈగల వేట మొదలుపెట్టింది.

ఇలా ప్రతిఏటా అర్థంఅయ్యీ, అర్థంకాని, అంతులేని సాంక్రమిక, సాంక్రమికేతర వ్యాధుల బారినపడి ప్రాణాలు వదులుతున్న ప్రజల ఆరోగ్య సంరక్షణ విషయంలో ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు యాదృచ్ఛికమైనవేమీ కావు. ఈ మరణాలకు కారణాలు ప్రస్తుతం ప్రభుత్వం అవలంబిస్తున్న ఈ ఏటి, లేదా గడిచిన ఒకటి రెండేళ్ళ విధానాల్ని గమనిస్తేనే అర్థం కావు. ప్రజారోగ్యం విషయంలో ప్రభుత్వాలవలంబించిన వైద్య విధానాలను, వాటి అభివృద్ధికి ప్రభుత్వం చేసిన, చేస్తున్న కృషిని తెలుసుకుంటేనే ఇప్పటి ఈ దారుణ పరిస్థితి సరిగ్గా అర్థం అవుతుంది.

యాభైనాలుగు సంవత్సరాల నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్య రంగం కోసం ద్రవ్య కేటాయింపులను క్రమంగా తగ్గిస్తూ వస్తున్నాయి. మొదటి ప్రణాళికలో (1951-56) ఆరోగ్య రంగానికి మొత్తం ప్రణాళికా వ్యయంలో 3.33 శాతాన్ని కేటాయిస్తే, రెండవ పంచవర్ష ప్రణాళికలో (56-61) దాన్ని 3 శాతం తగ్గించి క్రమంగా 9వ ప్రణాళికా కాలం (1997-2002) నాటికి 0.5 శాతానికి కుదించింది. ఈనాడు అనేక అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు జి.డి.పి.లో 5 నుండి 10 శాతం వరకు ఆరోగ్య రంగం కోసం ఖర్చు చేస్తుండగా మన ప్రభుత్వాలు మాత్రం జి.డి.పి.లో 0.6 శాతం ప్రజారోగ్య రంగానికి ఖర్చు చేస్తున్నాయి. ప్రభుత్వం ఇంత తక్కువ స్థాయిలో ఆరోగ్య రంగానికి ఖర్చు చేయటం మనకు తెలిసి ఏ దేశాల్లోను కనిపించదు. వివిధ దేశాలు ఆరోగ్య రంగానికి చేస్తున్న ఖర్చును పరిశీలిస్తే భారతదేశం కిందినుండి 3వ స్థానంలో వుంది. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకుంటున్న భారత్ ఆఫ్రికా దేశాలైన బురుండితో సమానంగా, రువాండా (2.1%) కంటే మూడున్నర రెట్లు తక్కువగాను జాతి ఆరోగ్యాన్ని భరిస్తుంది. అదీగాక గత 20 ఏళ్ళ నుంచి ఈ కేటాయింపుల నుండి ప్రాథమిక ఆరోగ్య రంగం పేరుతో కేవలం జనాభా నియంత్రణ అమలు కోసం 60 శాతానికి పైగా వాటాను మళ్ళిస్తూ జిల్లా, తాలూకా స్థాయి ఆరోగ్య రక్షణ కేంద్రాలను నిర్వీర్యపరుస్తున్నారు.

ప్రజారోగ్య విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో చేస్తున్న కేటాయింపుల ధోరణి కూడా ఇందుకు భిన్నంగా ఏమీలేదు. సాధారణంగా ఆరోగ్యానికి చేసే కేటాయింపులో దాదాపు 85 శాతాన్ని రాష్ట్రాలు సమకూరుస్తుండగా కేంద్ర ప్రభుత్వం కేవలం 15 శాతాన్ని మాత్రమే అందిస్తుంది. ఈరోజు ఏ రాష్ట్రం కూడా ఆరోగ్య రంగానికయ్యే ఖర్చులో తను రెవిన్యూ నుండి సగటున 5.6 శాతానికి మించి కేటాయించడం లేదు. కేటాయింపుల తగ్గింపులో రాష్ట్రాలు కూడా కేంద్రాన్నే ఆదర్శంగా తీసుకుంటున్నాయి. అందుకు ఆంధ్ర రాష్ట్రం మినహాయింపు కాదు. దీంతో పౌరుల ఆరోగ్య రక్షణ భారంలో ప్రభుత్వ వ్యయం నామమాత్రం అయి, ఆరోగ్య రక్షణలో పౌరుల జేబునుండి చేసే ఖర్చు పెరిగిపోయింది. దీంతో ఆరోగ్య మార్కెట్‌లో వైద్యాన్ని కొనుక్కోగలిగిన వారు బతుకుతున్నారు. లేనివారు దయనీయంగా చనిపోతున్నారు (ఇప్పుడు చనిపోతున్న పిల్లల్లో మొత్తం ఆర్థిక పరిస్థితి క్షీణించిన వారు, కూలినాలి, పేద మధ్యతరగతి కుటుంబాల బిడ్డలేనన్నది గమనించాలి).

ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం కూడా మొదటి పంచవర్ష ప్రణాళిక చేసిన ఖర్చు 13.74 శాతం వాటా కాగా అది 97-98 నాటికి

5.92కు తగ్గిపోయింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య ప్రమాణాలు ఆందోళనకరంగాను, అధ్వాన్నంగాను ఉన్నాయి.

క్రమ సంఖ్య	సంవత్సరం	రెవిన్యూ ఖర్చులో ఆరోగ్యానికి వాటా
1	1955-56	13.74
2	1960-61	8.89
3	1965-66	7.83
4	1970-71	8.74
5	1975-76	7.88
6	1980-81	7.55
7	1985-86	6.61
8	1991-92	5.82
9	1995-96	5.00
10	1996-97	5.30
11	1997-98	5.92

ఆధారం: మీడియోటింగ్ మెడికేర్ (హైదరాబాద్) ఆల్టర్‌నేటివ్ ఎకానమిక్ సర్వే (ఆంధ్రప్రదేశ్)

ఆరోగ్య ప్రమాణాల్లో మొత్తంగా దక్షిణాది రాష్ట్రాల కంటే ఉత్తరాది రాష్ట్రాలు వెనుకబడి ఉండగా దక్షిణాదిలో గల నాలుగు రాష్ట్రాల్లో ఆంధ్ర రాష్ట్రం వెనుకబడి వుంది. కేరళ, తమిళనాడు, కర్ణాటకలో శిశుమరణాలరేటు వరుసగా 13, 54, 53గా ఉంటే ఆంధ్రలో ఆ రేటు 66గా కొనసాగుతుంది. అదే మూడు రాష్ట్రాల్లో సగటు జీవితకాలం వరుసగా 72.0, 62.0, 61.9 ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో సగటు జీవితకాలం 60.6 నెలలతో ముగుస్తుంది.

భారతదేశాన్ని అంతర్జాతీయంగాను, ఆంధ్రప్రదేశ్‌ను అంతర్ రాష్ట్రీయం గాను పోల్చినపుడు కనిపిస్తున్న ఆరోగ్య ప్రమాణాలు అందోళనకరంగా ఉండడానికి స్థూలంగా ప్రజల పేదరికం, వైద్య వ్యవస్థ ప్రజలకు దూరంగాకొనసాగడం కారణాలుగా కనిపిస్తున్నాయి. ఒక్కసారి దేశానికి, రాష్ట్రానికి సంబంధించి ఆరోగ్య సదుపాయాల్ని, ఆరోగ్య కేంద్రాల వ్యవస్థ ఏర్పాట్లను పరిశీలిస్తే ప్రజారోగ్య విషయంలో ప్రభుత్వం సాధించిన ప్రగతి ఏపాటిదో అర్థం అవుతుంది.

1946లో బ్రిటిష్ ప్రభుత్వం వేసిన భోర్ కమిటీ నివేదిక ప్రకారం దేశంలో ప్రాథమిక, ద్వితీయ, తృతీయ స్థాయిలుగా కలిగిన మూడంచెల ఆరోగ్య నిర్మాణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ప్రజల అనారోగ్య సంబంధమైన అనేక సాంక్రమిక, సాంక్రమికేతర భయంకర వ్యాధులను నివారించి, నిర్మూలించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్న ఈ వ్యవస్థలు పాలకవర్గాలు అవలంబిస్తున్న అనైతిక, ప్రజావ్యతిరేక, సంపన్నుల అనుకూల ఆర్థిక విధానాల అమలు కారణంగా పూర్తిగా భ్రష్టుపట్టిపోయాయి. ముప్పై వేలకు ఒకటి చొప్పున ప్రారంభించి, దీర్ఘకాలంలో 15 వేల మందికి ఒక కేంద్రంగా ఏర్పాటుచేయాలని 50 ఏళ్ళ క్రితమే రూపొందించిన భోర్ కమిటీ ప్రణాళికలను స్వాతంత్ర్యానంతరం పాలకవర్గాలు ఈ రోజుకు కూడా సాధించలేకపోగా ఉన్న వ్యవస్థలనే ఎత్తివేసే స్థాయికి తీసుకువచ్చారు. జాతీయ ఆరోగ్య విధానం ముసాయిదాలో ముప్పై వేలకు ఒకటి చొప్పున ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని, నిర్ణయించిన ఈ కేంద్రాల్లో భోర్ చెప్పినట్లు ఆరుగురు వైద్యాధికారులకు బదులు ఒకరే ఉంటున్నారు. వ్యాధుల నివారణ చికిత్సలు అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్న ఈ కేంద్రాలు చికిత్సను గాలికొదిలి ప్రధానంగా నివారణే కార్యక్రమంగా కొనసాగించాయి. ఇప్పుడు ఆచరణలో అవీ చేయక కేవలం కుటుంబ నియంత్రణ కేంద్రాలుగా మారిపోయాయి. ఈ కేంద్రాల్లో ఎక్కువ భాగం శిథిలావస్థలోనూ, అద్దె ఇళ్ళలోనూ, విద్యుత్ సౌకర్యం లేకుండాను, ప్రసూతి, నీటి సౌకర్యాల లేమిగాను కొనసాగు తున్నాయని, చాలా కేంద్రాలకు (80%) రక్తపుపోటును పరీక్షించే పరికరాలు, బరువు తూచే పరికరాలు, ఆపరేషన్ థియేటర్లే లేవని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును విశ్లేషించిన కేంద్ర ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ డా. సుజాతారావు 1998లో ప్రకటించారు.

ఆరోగ్య సిబ్బంది విషయంలోనూ అదే పరిస్థితి. అనేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టరు ఉద్యోగ ఖాళీల సంఖ్య రెండంకెలకు మించే వుంది. గిరిజన ప్రాంతాల్లో ఇది మరీ ఎక్కువ. ఈ సంఖ్య సగటున 2.6 శాతం వుంటుంది. గిరిజన, గిరిజనేతర గ్రామీన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుడనేవారు పనికిరాని ప్రభుత్వ కార్యక్రమాలకు, కుటుంబ నియంత్రణ కార్యక్రమాలకు తప్ప మిగతా రోజుల్లో కనిపించదు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిస్థితి ఇలా వుంటే తాలూకా స్థాయి ఆరోగ్య కేంద్రాల పరిస్థితి ఇందుకేం తీసిపోదు. ప్రభుత్వ నివేదికల ప్రకారం 1996 నాటికి అవసరమైన 6500 తాలూకా స్థాయి ఆసుపత్రులకు గాను కేవలం 2500 (38%) మాత్రమే ఏర్పాటుచేశారు. ఒక కేంద్రంలో నలుగురు చొప్పున 2500 కేంద్రాల్లో 10 వేలమంది డాక్టర్లు ఉండాల్సివుంటే 1996 నాటికి 2751 మంది స్పెషలిస్టు వైద్యుల్ని మాత్రమే నియమించారు. ఈ ఆసుపత్రిలో అనునిత్యం ఆపరేషన్ అవసరం ఉన్నా అనస్థీషియా పోస్టు లేనే లేదు. *(తరువాయి 18వ పేజీలో)*

కాంగ్రెస్ 'చింతన్ శిబిర్' అలవాటైన అవకాశవాదానికి పునర్నిబద్ధత

- ఎన్. వేణుగోపాల్

భారతీయ జనతాపార్టీ మహారాష్ట్రలో జరిపిన 'చింతన్ బైఠక్'కు మూడువారాలలోనే భారత జాతీయ కాంగ్రెస్ కూడ ఉత్తరప్రదేశ్‌లోని సిమ్లాలో జూలై 7-9 మధ్య మూడురోజులపాటు చింతన్ శిబిర్ నిర్వహించింది. చివరిరోజున పధ్నాలుగు అంశాల సిమ్లా సంకల్ప్‌ను విడుదల చేసింది. ఈ మూడురోజుల సమావేశాల్లో చర్చించిన విషయాలలోను, సిమ్లా సంకల్ప్‌లో పొందుపరిచిన అంశాలలోను కాంగ్రెస్ పునరాలోచన ప్రారంభమైందని, తన పాత ప్రగతిశీల, ప్రజానుకూల విధానాల వైపు మళ్ళుతున్నదని పత్రికలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఇందులో కాంగ్రెస్‌కు ఇదివరకెప్పుడో ప్రగతిశీల, ప్రజానుకూల విధానాలుండేవనేది ఒక అబద్ధమైతే, ప్రస్తుత సిమ్లా సంకల్ప్ మళ్ళీ ప్రగతిశీల విధానాల వైపు మళ్ళబోతున్నదనేది మరో అబద్ధం. సిమ్లా సంకల్ప్‌లో ఆర్థిక సంస్కరణల పైన పునరాలోచన, వెనుకబడిన వర్గాల పట్ల ప్రేమవంటి నామమాత్రమైన అంశాలున్న మాట నిజమే కాని మొత్తంగా కాంగ్రెస్ చరిత్రలో భాగంగా చూసినప్పుడు వాటికి వాస్తవికమైన అర్థమేమీ లేదు. అవి కేవలం కాంగ్రెస్‌కు అలవాటైన అవకాశవాద ఎన్నికల వాగ్దానాలే.

చింతన్ శిబిర్‌లో చర్చించిన విషయాలు ఎన్ని ఉన్నా, తొలిరోజున సోనియాగాంధీ చేసిన ప్రారంభోపన్యాసంలో, చివరి రోజున విడుదల చేసిన సిమ్లా సంకల్ప్‌లోని పధ్నాలుగు అంశాల్లో చర్చించవలసినవీ, విశ్లేషించవలసినవీ ఎన్నో ఉన్నాయి.

'కాంగ్రెస్ కే హాథ్-గరీబ్ కే సాథ్' అనే నినాదానికి కాంగ్రెస్ కట్టుబడిఉన్నదని సోనియాగాంధీ అన్నారు. కాంగ్రెస్ చరిత్రలో, మరీ ముఖ్యంగా 1947 తర్వాత కాంగ్రెస్ చరిత్రలో ఈ మాట ఎంత అబద్ధమో చెప్పనక్కరలేదు. ఈ దేశంలో బడా భూస్వాములకు, బడా పెట్టుబడిదారులకు ఊడిగంచేయడానికి అహర్నిశలు శ్రమించిన కాంగ్రెస్ పేదల పక్షం వహించిన సందర్భం ఒక్కటి కూడా లేదంటే అతిశయోక్తి కాదు. స్వాతంత్ర్యానంతరం పేదలు మరింత పేదలయ్యారని, ధనికులు మరింత ధనికులయ్యారని స్వయంగా జవహర్‌లాల్ నెహ్రూయే అన్నాడంటే కాంగ్రెస్ పేదల ప్రయోజనాలు నెరవేర్చడానికి ఏమిచేసిందో అర్థమవుతుంది.

ఆ తర్వాత అధికారానికి వచ్చిన ఇందిరాగాంధీ పేదలలో భ్రమలు కల్పించడానికి, ఏమీ చేయకుండానే చేసినట్టు ఆర్భాటం చేయడానికి గరీబీ హఠావో అని నినదించారు. 1967 ఎన్నికలలో పొందిన పరాభవం నుంచి బయటపడటానికి పేదరికాన్ని ఒక సాధనంగా చేసుకుని, 1971 ఎన్నికలలో విజయం సాధించారు. ప్రగతిశీలమైనవిగా, ప్రజానుకూలమైనవిగా కనిపించే అనేక పథకాలను, విధానాలను ప్రకటించి, ఏఒక్కదాన్నీ చిత్తశుద్ధితో పూర్తిగా అమలుచేయలేదు. ఎమర్జెన్సీ చీకటిపాలనను, క్రూరనిర్బంధకాండను దేశంమీద రుద్ది, దానిమీదినుంచి దృష్టి మరల్చడానికి కూడ ఇందిరా గాంధీ పేదల పేరే వాడుకున్నారు. పేదలకు అనుకూలమైన ఇరవై సూత్రాల కార్యక్రమాన్ని ప్రకటించారు. మొత్తం మీద ఇందిర పాలనా కాలమంతటిలోనూ మాటలు ఎన్ని చెప్పినప్పటికీ వాస్తవంగా అమలైనవి మాత్రం ప్రగతిశీల, ప్రజానుకూల విధానాలు కావు. పేదలకు అనుకూలమైన, పేదరికాన్ని నిర్మూలించే విధానాలు కావు.

ఆ తర్వాత వచ్చిన రెండు కాంగ్రెస్ ప్రభుత్వాల-రాజీవ్‌గాంధీ, పి.వి.నరసింహారావు ఎజెండాలలోను పేదరికం గురించి ప్రస్తావనే లేదు. రాజీవ్‌గాంధీ ఆధునికీకరణ, ఇరవై ఒకటో శతాబ్దం పేరు తోను, పి.వి.నరసింహారావు నూతన ఆర్థిక విధానాలు, సంస్కరణల పేరుతోను దేశీ, విదేశీ సంపన్నులకు అనుకూలమైన, పేదలకు వ్యతిరేకమైన విధానాలనే తమ ప్రాధాన్యతగా ఎంచుకున్నారు.

ఈ నాలుగు దశాబ్దాల చరిత్ర నేపథ్యంలో ఇవాళ కాంగ్రెస్ కొత్తగా కాంగ్రెస్ కే హాథ్-గరీబ్ కే సాథ్ అని నినదించడం ప్రజలను మోసగించడమే తప్ప మరొకటి కాదు.

సోనియాగాంధీ గంభీరంగా చేసిన ఈనినాదం కేవలం ఎన్నికల ఎత్తుగడేనని చెప్పడానికి ఆమె ఆ వెంటనే చేసిన ప్రకటనే నిదర్శనం. పార్టీ నాయకులందరూ వ్యక్తిగత వైషమ్యాలు, విభేదాలు, అహం భావాలు పక్కన పెట్టి ఎన్నికల్లో విజయం కోసం పోరాడాలని ఆమె అన్నారు. దీన్నిబట్టే కాంగ్రెస్‌కు ఎన్నికల్లో విజయమే ప్రధానాంశ మని, పేదలకు తోడు నిలవడం అనేది ఎన్నికల విజయానికి ఒక భ్రమాపూరిత వాగ్దానమేనని అర్థమవుతుంది.

ఈ ప్రారంభోపన్యాసంలోనే ఆమె వాజ్‌పేయి ప్రభుత్వ వైఫల్యాలుగా ఏడు అంశాలను ప్రస్తావించారు. ఈ ఏడు అంశాల లోను పేదరికం, నిరుద్యోగం, ప్రపంచీకరణ, మతోన్మాదం వంటి అంశాలు లేవు సరిగదా, పరోక్షంగా ఆ అంశాలను ప్రస్తావించే అవకాశం ఉన్నచోట కూడా ఆమె ఆ పని చేయలేదు. అంటే ప్రజలు

ఎదుర్కొంటున్న నిజమైన సమస్యల విషయంలో ప్రభుత్వాన్ని నిల దీయాలని, తప్పుపట్టాలని కాంగ్రెస్‌కూడ అనుకోవడం లేదన్నమాట.

ఆ ఏడు అంశాలలో సోనియాగాంధీ అన్నిటికన్న ముందు ప్రస్తావించినవి తీవ్రవాదం, రక్షణవ్యవస్థ. నిజానికి ప్రజల తక్షణమైన, తీవ్రమైన సమస్యల నుంచి పక్కదారి పట్టించి, అసలు సమస్యల వైపు దృష్టి పోకుండా చేయడం కోసమే అన్ని పాలకవర్గాలూ తీవ్రవాద సమస్యనూ, రక్షణ సమస్యనూ లేవనెత్తుతున్నాయి. నిజంగానే ఆ సమస్యలు తీవ్రమైనవనే అనుకున్నా, అవి పేదరికం కన్నా, నిరుద్యోగం కన్నా తీవ్రమైన సమస్యలు కావు. తీవ్రవాద బూచినో, పాకిస్తాన్ బూచినో చూపి, అసలు ఆ సమస్యలు పరిష్కరించకుండా, ఎప్పటికీ ఆరని చిచ్చులా అట్లాగే ఉంచుతూ, ప్రజల నిజమైన సమస్యల పరిష్కారం నుంచి తప్పించుకోవడం పాలకులకు ఒక అలవాటైపోయింది. ఇప్పటివరకు ఢిల్లీ గద్దెనెక్కిన అన్ని పార్లమెంటరీ రాజకీయ పక్షాలూ ఈ రెండు సమస్యలనే అత్యంత ప్రధాన సమస్యలుగా చూపే బూటకపు తీవ్రతను ప్రదర్శిస్తూనే ఉన్నాయి.

సోనియాగాంధీ ఉపన్యాసంలో మత సామరస్యాన్ని పరిరక్షించ లేకపోయినందుకు కూడ భారతీయ జనతాపార్టీ నాయకత్వంలోని ఎన్.డి.ఎ. ప్రభుత్వాన్ని తప్పుపట్టారు. నిజానికి ఆమె ఉపయోగించిన భాషను పరిశీలిస్తేనే భాజపా పట్ల ఆమె వ్యతిరేకత ఎంత తక్కువ స్థాయిలో ఉన్నదో అర్థమవుతుంది. భారతీయ జనతా పార్టీని విమర్శించవలసింది “మతసామరస్యాన్ని పరిరక్షించలేకపోయి నందుకు” కాదు. స్వయంగా మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నందుకు! గుజరాత్ మారణకాండ తర్వాత కూడా నిస్సిగ్గుగా నరేంద్ర మోడీని నెత్తిన పెట్టుకొని తన ముస్లిం వ్యతిరేక హంతక స్వభావాన్ని చాటుకున్నందుకు! అటువంటి స్థితిలో మత సామరస్యాన్ని కాపాడ లేకపోవడం అనే సుతిమెత్తని మాటల వెనుక దాక్కోవడం కాంగ్రెస్‌లో కూడా మౌలికంగా ఉన్న హిందూ మతోన్మాద వాసనలను సంతోషపెట్టడానికే.

ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేయడం, గ్రామీణాభివృద్ధిపై కేంద్రీకరించడం చేయలేదని కూడ సోనియాగాంధీ వాజ్‌పేయి ప్రభుత్వాన్ని తప్పుపట్టారు. ఈ మాటలు వినడానికి చాలా బాగుంటాయి గాని ఈ రెండు అంశాలలోను వాజ్‌పేయి ప్రభుత్వాన్ని తప్పుపట్టవలసివుంటే, పాత కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను యథాతథంగా కొనసాగిస్తున్నందుకే తప్పుపట్టాలి. ఆర్థిక వ్యవస్థను దేశీయ వనరుల మీద ఆధారపడి, దేశీయ అవసరాలు తీర్చేదిశలో, స్వావలంబన, స్వయం సమృద్ధి లక్ష్యాలుగా నిర్వహించలేకపోయిన ఘనకీర్తి పూర్తిగా కాంగ్రెస్‌దే. గ్రామీణాభివృద్ధి మాటల్లోనే తప్ప ఆచరణలో చూపలేకపోయిన నిర్వాకం కాంగ్రెస్‌దే. స్వదేశీ, గ్రామస్వరాజ్ అని గొప్పలకుపోయే భారతీయ జనతాపార్టీ అక్షరాలా రాజీవ్‌గాంధీ-పి.వి.నరసింహారావ-మన్మోహన్‌సింగ్‌ల మార్గంలోనే నడుస్తోంది. అందువల్ల వాజ్‌పేయిని తప్పు పట్టేముందు ఈ రెండు అంశాలలోను తమ పొరపాట్లే దేశాన్ని ఈ స్థితికి తెచ్చాయని సోనియాగాంధీ పశ్చాత్తాపాన్ని ప్రకటించి ఉంటే బాగుండేది.

ఇక సిమ్లా సంకల్ప్ పూర్తిగా ఎన్నికల ప్రణాళిక లాగ ఆకర్షణీయమైన, ఆడంబరమైన వాగ్దానాలతో, ఆచరణకు రాని అతిశయోక్తులతో, వోట్లను మాత్రమే లక్ష్యంగా పెట్టుకున్న కుహనా పథకాలతో నిండిఉంది. ఈ ప్రకటనల తోనే విశ్లేషణకు పూనుకుంటే ప్రపంచంలోనే కాంగ్రెస్ లాంటి ప్రగతిశీల రాజకీయ పక్షం మరేదీ వుండదు. చింతన్ శిబిర్ తర్వాత పత్రికలలో రాస్తున్న రాజకీయ విశ్లేషకులు కేవలం ఈ మాటలనే, వాటి ముఖ విలువతో తీసుకుంటూ, కాంగ్రెస్ దిశ మారిపోతున్నదని, అందువల్ల కాంగ్రెస్ ఇచ్చిన సంకీర్ణ ప్రభుత్వాల, పొత్తుల పిలుపుకు, స్నేహహస్తానికి అనుకూలంగా స్పందించాలని నిర్ధారిస్తున్నారు.

ప్రారంభోపన్యాసంలో వదిలేసిన మతోన్మాదాన్ని, పొత్తులను మూడోరోజుకల్లా సిమ్లా సంకల్ప్‌లో చేర్చడం జరిగిందంటే ప్రజలను ఆకర్షించే, మభ్యపెట్టే నినాదాల గురించి పార్టీలో ఇంకా ఏకాభి ప్రాయం కుదరలేదని, అభిప్రాయాలకు స్థానం కల్పించే ప్రయత్నం జరుగుతున్నదని అర్థం.

లౌకికవాదం, ఆర్థికాభివృద్ధి, సామాజిక సాధికారతలక్ష్యాలుగా, ప్రజాస్వామిక సూత్రాలకు కట్టుబడి, ప్రగతిశీల భావాలు కలిగిన వ్యక్తులు, సంస్థలు, రాజకీయ ఉద్యమాలతో కలిసి పనిచేయాలని కాంగ్రెస్ ఈ సిమ్లా సంకల్ప్‌లో చెప్పుకుంది. లౌకికవాదానికి గత యాభై సంవత్సరాలలో తానే ఎట్లా తూట్లు పొడిచిందో, శిలాన్యాస్‌ను అనుమతించి, బాబ్రీ మసీదులో రామ్‌లాలా అక్రమ విగ్రహాల పూజకు తాళాలు తెరవడం ద్వారా తానే ఎంత మతోన్మాద పాత్రను వహించిందో తప్పు ఒప్పుకొని పశ్చాత్తాపం ప్రకటిస్తే తప్ప కాంగ్రెస్‌కు లౌకికవాదం మాట ఎత్తే అర్హతలేదు.

ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ఒత్తిడులకు తలొగ్గి దేశాన్ని ఎట్లా స్వావలంబన దిశనుంచి పక్కకు తప్పించి, ప్రపంచీకరణ రథచక్రాలకు కట్టివేసి తప్పుచేసిందో ఒప్పుకుంటేతప్ప కాంగ్రెస్‌కు దేశాభివృద్ధి, ఆర్థికాభివృద్ధి గురించి మాట్లాడే అర్హతలేదు.

దేశంలో మొదటిసారిగా సామాజిక సాధికారత, సామాజిక న్యాయం అంశాలను చర్చకు తెచ్చిన వి.పి.సింగ్ ప్రభుత్వాన్ని కూల్చడం ద్వారా, మండల్ కమిషన్ వ్యతిరేకతకు తాను ఎట్లా

(తరువాయి 14వ పేజీలో)

కన్‌కున్ డబ్ల్యు.టి.ఓ. సమావేశం - పేద దేశాల ఆరోగ్య భవిత

- ప్రొ. పి. నారాయణ రెడ్డి

ఇంకో 60 రోజులలో ప్రపంచ వాణిజ్య సంస్థ 5వ మంత్రుల స్థాయి సదస్సు మెక్సికోలోని కన్‌కున్‌లో సెప్టెంబర్ 10 నుండి 14 వరకు జరగనుంది. అభివృద్ధి చెందుతున్న మనలాంటి దేశాలకు ఇదొక అవకాశం, సవాలు కూడా. దోహాలో జరిగిన సదస్సులో బడుగుదేశాలు తమ వాదనను గట్టిగా వినిపించాయి. అలాగే అభివృద్ధి చెందిన దేశాల ఎత్తుగడలను, కుతంత్రాలను ఎండగట్టాయి. అయినప్పటికీ అభివృద్ధి చెందిన దేశాలు మాత్రం వివాదాస్పదమైన అంశాలను భవిష్యత్తు చర్చలకు ఈ సమావేశం "ఎజెండా"లో చేర్చగలిగాయి. దోహాలో సాధించిన కొద్దిపాటి సానుకూలతను మెక్సికోలో జరిగే సదస్సులో పటిష్టపరచుకొని, వివాదాస్పద అంశాలపై అభివృద్ధి చెందిన దేశాలను ఒప్పించడం ఒక పెద్దసవాలు.

రాబోయే మంత్రుల స్థాయి సదస్సులో అనేక అంశాలపై ఒక అభిప్రాయానికి రావలసివున్నా, ముఖ్యమైనవి రెండు : ఒకటి, ప్రాణాంతకమైన వ్యాధుల నుండి బడుగుదేశాలలోని బీద ప్రజలను రక్షించేందుకు అవసరమైన ఔషధాల విషయంలో మేధో హక్కుల (patent rights) నుండి మినహాయింపు పొందడం. రెండు సేవల విషయంలో స్వేచ్ఛగా వివిధ దేశాలకు వెళ్ళడానికి ఆటంకాలు కలిగించకూడదన్న మరో విషయం.

సభ్యదేశాల మధ్య వివాదాస్పదమైన అంశం దోహా తీర్మానంలో పొందుపరచిన ప్రజారోగ్య సంబంధమైనది. ఆ తీర్మానంలో ప్రాణాంతకమైన వ్యాధులను నిర్వచిస్తూ అందులో ఎయిడ్స్, క్షయ, మలేరియా, ఇతర అంటువ్యాధులను పేర్కొన్నారు. ఈ వ్యాధుల నుండి ప్రజలను రక్షించేందుకు ఆయా ప్రభుత్వాలు మేధో హక్కులను ఉల్లంఘించేందుకు మినహాయింపు కల్పించటం జరిగింది. అసలు సమస్య ఇక్కడే వుంది. అభివృద్ధి చెందిన దేశాలు ప్రత్యేకించి అమెరికా ప్రాణాంతకమైన వ్యాధుల నిర్వచనం చాలా స్థూలంగా వుంటూ స్పష్టత లేదని ఈ తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నది. అమెరికా ఆమోదించక పోవడానికి వెనక ఆదేశంలోని బడా ఔషధ కంపెనీలే మోకాలడ్డు వేస్తున్నాయి. కారణం అమెరికా దేశ బహుళజాతి సంస్థలు ప్రపంచ ఔషధ మార్కెట్‌లో 50 శాతానికి పైగా తమ ఆధీనంలో వుంచు కున్నాయి. ఒకసారి డబ్ల్యు.టి.ఓ. ప్రతిపాదించిన తీర్మానాన్ని అంగీక రిస్తే ప్రపంచ ఔషధ మార్కెట్‌మీద వున్న ఆధిపత్యం దెబ్బతింటుంది. ఎందుకంటే ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షించుకోవడానికి నిరుపేద దేశాలే కాక అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా (ఆర్థికంగా బలపడుతున్న) మేధో హక్కులను ఉల్లంఘించే అవకాశ ముంటుంది కనుక. అందువల్ల అమెరికా ఈ తీర్మానంలో ప్రాణాంతకమైన వ్యాధులను 23గా గుర్తించాలని, పేటెంట్ల ఉల్లంఘన కేవలం ఈ వ్యాధులకే పరిమితం చెయ్యాలని వాదిస్తున్నది. కానీ సభ్యదేశాలు ప్రాణాంతకమైన వ్యాధుల గుర్తింపు విషయంలో కొంత వెసులుబాటు వుండాలని పట్టుబడుతున్నాయి. ఇది న్యాయం కూడా. ఇదే జరిగితే ఫార్మా మార్కెట్‌పై పట్టు కోల్పోతామని అమెరికా ఫార్మా కంపెనీల భయం. ఇందువల్ల అమెరికాను దోహా డిక్లరేషన్‌ను సమ్మతించనీయక వత్తిడి తెస్తున్నాయి.

"ట్రిప్స్" ఒప్పందం జనవరి 2005 నుండి అమలుకావలసి వుంది. అప్పటికి అన్నిదేశాల సమ్మతి పూర్తికావాలి. డబ్ల్యు.టి.ఓ. డైరెక్టర్ జనరల్ సభ్యదేశాల మధ్య జరుగుతున్న చర్చలు విఫలం కావడంపై ఆయన తన ఆవేదనను వ్యక్తపరిచారు. ఇక్కడ మనం ఒకటి గుర్తించాలి. మేధో హక్కుల కౌన్సిల్ జూన్ 27, 2002న ఔషధాలను ఉత్పత్తి చేసుకోవటానికి అవసరమైన శక్తి సామర్థ్యాలు లేని అతి బీద దేశాలకు మేధో హక్కుల ఉల్లంఘనకు మినహాయింపు 2016 వరకు అవకాశం ఇవ్వడం జరిగింది. అలాగే జాతి దృష్ట్యా ఏది అత్యవసర పరిస్థితో నిర్ణయించుకోడానికి ఆయా దేశాలకు అనుమతినివ్వడం జరిగింది. ఈ విషయంలోనే అమెరికాకు ఇతర దేశాలకు భేదాభిప్రాయాలు తలెత్తుతున్నాయి.

"ట్రిప్స్" డబ్ల్యు.టి.ఓ. పరిధిలోకి వచ్చినప్పటి నుండి ఒక విషయంలో మార్పు కనిపిస్తూ వుంది. అది ఔషధాల ధరలు పెరగడం ఫలితంగా దారిద్ర్యంలో మ్రగ్గుతున్న పేద ప్రజానీకానికి వైద్యం గగనకుసుమంగా మారుతోంది. ప్రతిరోజూ అంటువ్యాధుల

కారణంగా బడుగు దేశాలలో 30,000లకు పైగా మృత్యువాత పడుతున్నారు. దీనికి కారణం ఈ ప్రాణాంతకమైన వ్యాధులకు ఔషధాలు సామాన్యమానవుడికి అందుబాటులో లేకుండాపోయాయి. యు.ఎన్.డి.పి. అంచనా ప్రకారం "ట్రిప్స్" అమలుజరగడం మొదలైతే ఔషధాల ధరలు 12 శాతం నుండి 68 శాతం వరకు పెరుగుతాయి. అంటే బడుగుదేశాల ప్రజల ఆరోగ్యం డబ్ల్యు.టి.ఓ.కు పట్టదన్నమాట. అందుకనే బడుగు దేశాలు తమ దేశాల ప్రజల శ్రేయస్సు దృష్ట్యా అమెరికా లాంటి దేశాల్లో వాటివెనుకనున్న ఫార్మా కంపెనీలు దోహా తీర్మానాన్ని సానుకూలతతో చూడాలని వాదిస్తున్నాయి. ఈ వాదనలో పస వుంది. ప్రపంచ మానవాళి ఆరోగ్యవంతంగా వుండడమా లేక కొన్ని ఫార్మా కంపెనీల లాభాలు ముఖ్యమా అన్నది. ఈ పరిస్థితి గమనించే బ్రెజిల్ ఔషధ కంపెనీల మందులపై ధరలను ప్రజలకు అందుబాటులో వుండేలా తగ్గించకపోతే హక్కులను రద్దు చేస్తామని బెదిరించింది కూడా. పర్యవసానంగా బహుళజాతి సంస్థలు బ్రెజిల్ దేశంలో పెట్టుబడులు పెట్టమని ప్రతిచర్యగా ప్రకటించింది. అందుకనే అన్నారు ధనిక దేశాలు, బీద దేశాల మధ్య రావణకాష్టంగా కాలే అంశం డబ్ల్యు.టి.ఓ.లో పొందుపరచిన "ట్రిప్స్".

ఆ ప్రతిష్టంభన తొలగేందుకు ఈ స్థితికి మూలకారణమైన అమెరికా ఫార్మా కంపెనీలను కలిసి విషయాన్ని చర్చించి, వారిని ఒప్పించి తద్వారా అమెరికాను తీర్మానానికి సమ్మతించాలన్నది ప్రస్తుత ఆలోచన. నిజానికి బడుగు దేశాలకు ఇదొక మంచి మార్గమౌతుంది. ఎందుకంటే సభ్య దేశాలను అంగీకరింపచేయడం కాక దీని వెనుకనున్న సంస్థలను, వ్యక్తులను కూడా అనునయించాలన్నమాట. డబ్ల్యు.టి.ఓ. విషఫలితాల ప్రభావం బడుగుదేశాలలో ఎక్కువ వుంటుంది. ఆయా దేశాలలో ప్రెషర్ గ్రూప్స్ ఏర్పడి ఆయా దేశాలపై వత్తిడి తెచ్చినట్లయితే ఆయా దేశాలు భవిష్యత్తులో డబ్ల్యు.టి.ఓ. ప్రతిపాదించే ఏ తీర్మానాన్నైనా అంగీకరించనవసరం లేదు. ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోలేమని ఆయా ప్రభుత్వాలు చేతులెత్తి వేయవచ్చు. ఈ పరిణామం సామాన్య దేశాలకు ముందుముందు అనుకూలించవచ్చు. ఈ ప్రతిష్టంభన, రాద్ధాంతమంతా ఒక విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నదేమంటే "ట్రిప్స్" అమలులో బడుగు దేశాలకు తగినంత సహాయసహకారాలు, వెసులుబాట్లు తప్పనిసరిగా కల్పించాలి. అలాకానియెడల డబ్ల్యు.టి.ఓ. భవిష్యత్తు అస్తవ్యస్తంగా వుంటుంది. పేటెంట్ హక్కుదారులకు, అభివృద్ధి చెందుతున్న దేశాల ఆశయాలకు మధ్య ప్రయోజనకరమైన అవగాహన ఏర్పడటం కష్టం. డబ్ల్యు.టి.ఓ.నిర్ణయాలలో మానవత్వం వైపై మొగ్గుచూపాలి కాని స్వార్థ శక్తులకు సాయపడకూడదు.

మరో ముఖ్యమైన అంశం 'సేవలు' కొంతలో కొంత బడుగు దేశాలకు సానుకూలంగానూ, లాభసాటిగా వుండేది ప్రత్యేకించి భారత్ లాంటి దేశాలకు ఈ రంగమే. ఈ దేశాలలో ఉన్నతమైన, ప్రపంచదేశాలకు అవసరమైన మానవవనరులు సమృద్ధిగావున్నాయి. కనుక మానవ వనరుల అవసరం ఎక్కడుంటే ఆ అవకాశాలను ఉపయోగించుకునే విధంగా కార్మికులు స్వేచ్ఛగా వెళ్ళగలిగే విధంగా అభివృద్ధి చెందిన దేశాలు సంస్కరణలు తీసుకురావాలి. కానీ పెట్టుబడులు ఎంత స్వేచ్ఛగా బదలాయించాలని కోరుతున్నాయో, అదే స్థాయిలో మానవ వనరులను కూడా స్వేచ్ఛగా వెళ్ళేందుకు అభివృద్ధి చెందినదేశాలను ఒప్పించాలి. అప్పుడే బడుగు దేశాలకు వృద్ధి చెందడానికి అవకాశముంటుంది. కనుక సేవలకు సంబంధించి తీర్మానాలలో ఈ అంశాన్ని పొందుపరచాలి.

వివిధ దేశాల మధ్య వున్న ఆర్థిక అసమానతలు, వివిధ దేశాలకున్న ప్రత్యేక వనరులు, సానుకూలత, అలాగే ఆయా దేశాలకున్న లోపాలు, చర్చనీయాంశాలు కావాలి. కూలంకషమైన చర్చల ద్వారా తమకున్న మిగులును, శక్తి సామర్థ్యాలను ఇతర దేశాలతో లాభసాటిగా పంచుకునే విధంగా చర్చలు జరగాలి. ఈ విషయంలో భారత్ చొరవ తీసుకొని బడుగు దేశాలను ప్రభావితం చేసి వారి అవసరాలను ఒకచోట చేర్చి డబ్ల్యు.టి.ఓ.ను సరియైన మార్గంలో ముందుకెళ్ళేట్లు మార్గదర్శనం చేయాలి. అంటే దోహా మంత్రుల స్థాయి సదస్సులో బడుగు దేశాలకు ఏర్పడిన ఆశకు, నమ్మకానికి కన్‌కున్ సమావేశంలో తగిన పునాదులు వేయాలి. ○

వర్తమాన సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల నుండి వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం

చిరునామా : సంపాదకులు **"ప్రజాపక్ష సమీక్ష"**
నాగార్జున నగర్, హైదరాబాద్-500 073.

నిత్యజీవితంలో బహుళజాతి సంస్థలు - 2

— ఎన్. వేణుగోపాల్

మన దైనందిన జీవితంలో ఇవాళ బహుళజాతి సంస్థలు ప్రవేశించని చోటు, విస్తరించని సమయం లేదని గత అధ్యాయంలో స్థూలంగా చెప్పుకున్నాం. ఈ చొరబాటును ఇంకా వివరంగా సూక్ష్మస్థాయిలో అర్థం చేసుకోవాలంటే అటు బహుళజాతి సంస్థల కార్యక్షేత్రాల వైపునుంచి గాని, ఇటు మన జీవన కార్యకలాపాలతో మనం వాడుతున్న సరుకుల వైపునుంచి గాని, సేవల వైపునుంచి గాని వర్గీకరించి అర్థం చేసుకోవలసి వుంటుంది. సబ్బులు, టూత్ పేస్టుల తయారీ నుంచి విమానాలు, విద్యుదుత్పత్తి పరికరాల దాకా బహుళజాతి సంస్థలు తయారుచేసే సరుకులు ఎన్నో ఉన్నాయి. బ్యాంకింగ్, రవాణా సేవల నుంచి ప్రభుత్వాలకు సలహాలిచ్చేదాకా బహుళజాతి సంస్థలు మూడో ప్రపంచ దేశాలకు అమ్ముతున్న సేవలు ఎన్నో ఉన్నాయి. అంటే మనం నేరుగా ఏ ఒక్క బహుళజాతి సంస్థ సరుకునూ, సేవనూ ఉపయోగించగూడదని అనుకున్నా, పరోక్షంగా ఏదోఒక బహుళజాతి సంస్థ సరుకునూ, సేవనూ ఉపయోగించక తప్పని స్థితి ఉంది.

నిత్యజీవితంలో బహుళజాతి సంస్థల చొరబాటును పరిశీలించ డానికి భారీ యంత్ర పరికరాలతో, సేవారంగంలో, వ్యవసాయోత్ప త్తుల ప్రాసెసింగ్, మారుబేరాలలో, వినియోగ వస్తువులలో వాటి ప్రవేశాన్ని, వాటి ప్రయోజనాలను అధ్యయనం చేయవలసి వుంటుంది. నిజానికి ఈ నాలుగు రంగాలలోను భారతదేశం వంటి విస్తృతమైన సహజ వనరులు, మానవ శ్రమశక్తి ఉన్న దేశం బహుళజాతి సంస్థలమీద ఆధారపడనక్కరలేదు. భారత పరిశ్రమ, సాంకేతిక పరిజ్ఞాన స్థాయి ఉత్పత్తి చేయలేని భారీ యంత్ర సామగ్రి ఏమీలేదు. సేవా రంగంలో నిజంగా భారత ప్రజలకు అవసరమైన సేవలేవో సమీక్షించుకొని సరైన విధానాలను అవలంబిస్తే సేవల స్వావలంబన సాధించవచ్చు. వ్యవసాయోత్పత్తులలో భారతదేశం సాధించిన స్వయం సమృద్ధిని పాలకులే చేజేతులా విధ్వంసం చేసి, వ్యవసాయ రంగాన్ని బహుళజాతి సంస్థల చేతికి అప్పగించారు.. ఇక వినియోగ వస్తువులలో ఆడంబరానికి పోకుండా, తక్షణావసరాలు తీర్చే ప్రాతిపదికపై ఒక సమగ్ర విధానాన్ని గనుక రూపొందించ గలిగితే దేశ ప్రజలకు అవసరమైన వినియోగ వస్తువులను స్వయం శక్తితో తయారుచేసుకోవడం సాధ్యమే.

కాని ఈ నాలుగు రంగాలలోనూ బలసంపన్నమైన బహుళ జాతి సంస్థలు భారత పాలకుల మెడలు వంచి, మరీ ముఖ్యంగా 1991 నూతన ఆర్థిక విధానాల తర్వాత, దేశంలోకి విస్తరించి ఊడల మర్రిలా పాకిపోయాయి.

ఈ పైనుంచి బహుళజాతి సంస్థల చొరబాటు చిత్రానికి, కిందినుండి ప్రజలలో తయారైన సమ్మతిని కలపకపోతే దృశ్యం పూర్తికాదు. కిందినుంచి, ముఖ్యంగా మధ్యతరగతిలో బహుళజాతి సంస్థల ప్రవేశానికి అనుకూలమైన, ఆహ్వానించే భావాలను ప్రవేశపెట్టడం, పదేపదే ప్రచారంచేసి గత్యంతరంలేదనే అభిప్రాయం కలిగించడం క్రమబద్ధంగా, ప్రణాళిక ప్రకారం జరిగింది.

అందులోనూ భారీ యంత్ర సామగ్రి, స్థూల ఆర్థిక వ్యవస్థస్థాయి సలహాల రంగంలో విడివిడిగా ప్రజలకు నిర్ణయాధికారం ఏమీలేదు. ఆ స్థాయిలో నిర్ణయాధికారం అటు ప్రభుత్వాలకు గాని, బడా పారిశ్రామికవేత్తలకు గాని మాత్రమే ఉంటుంది. అంతిమ ఫలితాలు ప్రజల నిత్య జీవితం మీద ఉన్నప్పటికీ ఈ స్థాయిలో ఫలానా నిర్ణయం తీసుకోమని గాని, వద్దనిగాని చెప్పడానికి తగిన సమాచారం ప్రజలకు అందుబాటులో లేదు. చెప్పే అవకాశమూ లేదు. ఇక మిగిలినవి నిత్యం వాడుకునే వినియోగ సరుకులు, సేవలు, వ్యవసాయోత్పత్తులు. ఇవి మన మార్కెట్లలోకి ఎంతగా విస్తరించా యంటే కొన్ని రంగాలలో మార్కెట్లో పోటీపడేవీ, దొరికేవీ అన్నీ బహుళజాతి సంస్థల ఉత్పత్తులే. వినియోగదారు వాటిలోనే ఏదో ఒకదాన్ని ఎంచుకోవలసిన పరిస్థితి ఉంది.

వీటిలో వినియోగదారీ సరుకుల దగ్గర మన పరిశీలన మొదలుపెడదాం.

బహుళజాతి సంస్థల, వ్యాపారస్తుల మార్కెట్ పరిభాషలో వీటిని వేగంగా అమ్ముడయ్యే వినియోగ వస్తువులు (ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్-ఎఫ్.ఎం.సి.జి.) అంటారు. ఎక్కువకాలం నిలువ వుండని, రోజువారీ అవసరానికి ఉపయోగపడే సరుకులన్నీ ఈ వర్గీకరణ కిందికి వస్తాయి. వ్యాపారస్తుల, ఉత్పత్తిదార్ల నిర్వచనం ప్రకారం ఈ సరుకులను ప్రతి వినియోగదారు సగటున నెలకొకటైనా కొంటారు.

అంటే భారత జనాభాలో కనీసం మధ్యతరగతినే లెక్కవేసుకున్నా ముప్పై కోట్లమంది ఉన్నారనుకుంటే, సరుకుల వినియోగం కూడ మనుషుల లెక్కన కాక కుటుంబం లెక్కన వేసుకున్నా, ప్రతినెలా ఈ సరుకులు కనీసం ఆరు కోట్లు అమ్ముడవుతాయనుకోవాలి. ఇది కనీస పక్షం అంచనా. నిజానికి ఈ వినియోగ సరుకులకు మధ్య తరగతి లోనే కాక ఇతర వర్గాలలో కూడా మార్కెట్ ఉంది గనుక ఇది కొన్నివేల కోట్ల రూపాయల మార్కెట్.

ఈ ఎఫ్.ఎం.సి.జి. రంగంలో బట్టలు ఉతికే సబ్బులు, పౌడర్లు వంటి సబ్బులు, టూత్ పేస్టులు, టూత్ పౌడర్లు, బ్రష్షులు, షాంపూలు, క్రీములు, పౌడర్లు, ఆహార పదార్థాలు తీపి పదార్థాలు, పానీయాలు, సిగరెట్లు వంటి ఎన్నో సరుకులను లెక్కిస్తారు.

ఈ సరుకులకు వ్యాపార వర్గాలు, ఉత్పత్తిదార్లు ఆపాదిస్తున్న లక్షణాలను చూస్తే, వీటిలో బహుళజాతి సంస్థలు లేదా భారీ పెట్టుబడిదారులు మాత్రమే నిలదొక్కుకోవడానికి ఎటువంటి పరిస్థితులు కల్పించబడ్డాయో అర్థమవుతుంది.

ఈ సరుకులు విడివిడిగా, ఒక్కొక్కటిగా చూస్తే ఖరీదైనవి కావు. కాని ఒక వినియోగదారు మొత్తం ఖర్చులో ఈ సరుకుల వాటా చాలా ఎక్కువ. ఒక్కొక్క సరుకుమీద ఉత్పత్తిదారుకు గాని, వ్యాపారికి గాని వచ్చే లాభం ఎక్కువ కాకపోవచ్చు కాని ఆ సరుకుల వినియోగం విపరీతంగా ఉండడం వల్ల లాభాలు చాలా ఎక్కువగా ఉంటాయి.

ఈ సరుకులు కొనేటప్పుడు వినియోగదారులు పెద్దగా ఆలోచించరు. ఆ సరుకుల సాంకేతిక లక్షణాలేమిటనేది చూడరు. తెలిసిన బ్రాండ్‌నే పదేపదే కొంటూ ఉండడమో, ఎవరైనా చేసిన సిఫారసు ఆధారంగానో, ప్రకటన ఆకర్షణతోనో కొంటూ ఉండడమో చేస్తూ వుంటారు.

ఉత్పత్తిదార్లు, వ్యాపారస్తులు ఈ ఎఫ్.ఎం.సి.జి. సరుకులకు ఆపాదించే మిగిలిన లక్షణాలు ఎలా ఉన్నా, ఈ రెండు లక్షణాలూ బహుళజాతి సంస్థలకు, భారీ పెట్టుబడిదారులకు ఈ రంగాన్ని చాలా ఆకర్షణీయమైన, అనువైన రంగంగా మారుస్తాయి. ఈ సరుకుల విషయంలో యూరప్, అమెరికా మార్కెట్లు ఇప్పటికే పూర్తయిపోవడం వల్ల, భారత మార్కెట్ చాలా పెద్దది కావడం మాత్రమే కాక, భారత మార్కెట్‌లో సగానికి పైగా ఇప్పటికీ స్థానిక, చిన్న ఉత్పత్తిదార్ల సరుకులతో నిండిఉండడం వల్ల, ఈ మార్కెట్‌ను ఆక్రమించడానికి బహుళజాతి సంస్థలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి.

అట్లాగే, వినియోగదారుల మనసుల్లో తమ బ్రాండ్ మాత్రమే నిలిచివుండేలా చూడాలంటే అన్ని ప్రచార, ప్రసార సాధనాల్లో విపరీతంగా వ్యాపార ప్రకటనలు ఇవ్వవలసి వుంటుంది. స్థానిక, చిన్న పెట్టుబడిదారుల కన్న బహుళజాతి సంస్థలు, భారీ పెట్టుబడిదారులు ఇటువంటి భారీ వ్యాపార ప్రకటనలు ఇవ్వగలరు. క్రమక్రమంగా మార్కెట్లను విస్తృతం చేసుకోగలరు.

అంతర్జాతీయంగా ఎఫ్.ఎం.సి.జి. మార్కెట్లలో యూనిలివర్, ప్రోక్టర్ అండ్ గాంబిల్, కొల్గేట్, నెజిల్, హీంజ్, స్మిత్‌క్లైన్‌వంటి కొన్ని బహుళజాతి సంస్థలే అత్యధిక మార్కెట్ వాటాలతో రాజ్యం చేస్తున్నాయి. ఈ అన్ని బహుళజాతి సంస్థలు ప్రత్యక్షంగానో, మిలాఖత్తులతోనో భారత మార్కెట్‌లో కూడ సింహభాగాన్ని ఆక్రమించి ఉన్నాయి.

భారత మార్కెట్లలో బహుళజాతి సంస్థల ప్రవేశాన్ని 1947 తర్వాత కూడా ఆమోదించాలని భారత ప్రభుత్వం నిర్ణయించుకుంది. అప్పటికి హిందుస్తాన్ లివర్ (యునిలివర్ మిలాఖత్తు సంస్థ)కు మాత్రం భారతదేశంలో ఉత్పత్తి కేంద్రాలు ఉండేవి. కొల్గేట్, నెజిల్‌లకు వ్యాపారం మాత్రం ఉండేది. 1960లలో ఎన్నో బహుళ జాతి సంస్థలు భారత మార్కెట్లో ప్రవేశించి ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేశాయి. అప్పటి చట్టాలు స్వావలంబన విధానం పునాదిగా ఈ బహుళజాతి సంస్థల ప్రవేశం మీద, వ్యాపారం మీద ఆంక్షలు విధించాయి. 1978లో జనతాపార్టీ ప్రభుత్వం బహుళజాతి సంస్థలు భారతీయ ఉత్పత్తి కేంద్రాలలో వాటాను 40 శాతానికన్నా తగ్గించుకోవాలని లేదా దేశం వదిలిపోవాలని ఆదేశించింది. ఐ.బి.ఎం., కోకాకోలా వంటి కంపెనీలు దేశం వదిలి వెళ్ళిపోగా, హిందుస్తాన్ లివర్ ఆంక్షలకు లోబడి కొనసాగింది.

నూతన ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ ప్రారంభమైన 1991 తర్వాత (నిజానికి 1985 రాజీవ్‌గాంధీ దిగుమతుల సడలింపు నుంచే) భారత ప్రభుత్వం బహుళజాతి సంస్థలకు ఆహ్వానాలు పలకడం, వాటి విస్తరణకు అనుకూలమైన పరిస్థితులు కల్పించడం ప్రారంభించింది. ముఖ్యంగా ఎఫ్.ఎం.సి.జి. రంగంలో అప్పటి వరకూ దిగుమతులను నిరుత్సాహపరచడానికి అమలులో ఉండిన భారీ ఎక్సైజ్ డ్యూటీలకు విపరీతంగా తగ్గించడం ప్రారంభించింది.

బట్టలు ఉతికే సబ్బులమీద పౌడర్లమీద ఎక్సైజ్ సుంకాన్ని 1993-94లోని 35 శాతం నుంచి 1998-99 నాటికి 16 శాతం తగ్గించింది. ఈ తగ్గుదల వంటి సబ్బులలో 20 శాతం నుంచి

16 శాతానికి, టూత్ పేస్ట్‌లలో 20 శాతం నుంచి 8 శాతానికి, కాస్మెటిక్స్‌లో 120 శాతం నుంచి 30 శాతానికి జరిగింది.

అప్పటివరకూ ఎఫ్.ఎం.సి.జి. రంగంలో ఉండిన లైసెన్సింగ్ నిబంధనలను కూడ సులభతరం చేసి, స్థానిక, అసంఘటిత ఉత్పత్తిదార్ల మార్కెట్లను బహుళజాతి సంస్థలు కొల్లగొట్టేందుకు రంగం సిద్ధం చేసింది. గ్రామీణ మార్కెట్లలోకి కూడా బహుళజాతి సంస్థలు సులభంగా చొరబడేందుకు వీలుగా ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, జపాన్ ఒ.ఇ.సి.ఎఫ్. వంటి సంస్థల నిధులతో పెద్దఎత్తున రోడ్ల నిర్మాణ కార్యక్రమాలు చేపట్టింది.

ఇప్పటికీ ఎఫ్.ఎం.సి.జి. రంగంలో బహుళజాతి సంస్థల ప్రవేశానికి కొన్ని ఆటంకాలున్నాయని, వాటిని తొలగించమని బహుళజాతి సంస్థలు, అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు భారత ప్రభుత్వం మీద, రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి తెస్తున్నాయి. ప్రజల ఆదాయ స్థితి తక్కువ స్థాయిలో ఉండడం వల్ల కొనుగోలు శక్తి లేదని, అందువల్ల ప్రభుత్వ కార్యక్రమాలు నేరుగా బహుళజాతి సంస్థల సరుకుల పంపిణీకి సహకరించాలని, మార్కెట్లను అభివృద్ధి చేయాలని, తక్కువ ఉత్పత్తి వ్యయంతో తక్కువ ధరలకు అమ్ముతూ తమకు పోటీగా నిలుస్తున్న స్థానిక ఉత్పత్తిదారులను నాణ్యత పేరుతో కట్టడి చేయాలని బహుళజాతి సంస్థలు కోరుతున్నాయి. దేశంలో మొత్తం యాభై లక్షలకు పైగా చిల్లర దుకాణాలు ఉన్నాయని, ఇంత పెద్ద సంఖ్యలో దుకాణాలు ఉండడం పంపిణీ వ్యవస్థను సంఘటితం చేయడానికి ఆటంకమని, అందువల్ల భారీ సూపర్ మార్కెట్లను ప్రోత్సహించే విధానాలు చేపట్టమని బహుళజాతి సంస్థలు కోరుతున్నాయి. కోల్డ్ స్టోరేజీలు, మంచిరోడ్లు వంటి సాధన సంపత్తి కల్పించడం ద్వారా మార్కెట్లను ఆధునికీకరించాలని కోరుతున్నాయి.

ఈ ఒత్తిడులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే తల ఒగ్గుతున్నాయి. అందువల్ల గత పదిసంవత్సరాలలో మన మార్కెట్లలో ఎన్నో గణనీయమైన మార్పులు జరిగిపోయాయి. కొత్త కొత్త సరుకులు, మార్కెటింగ్ పద్ధతులు, పంపిణీ పద్ధతులు, సూపర్ మార్కెట్లు, గ్రామీణ మార్కెట్లలో కూడా బ్రాండెడ్ సరుకులు ప్రవేశించాయి. స్థానిక పారిశ్రామిక కేంద్రాలలో చిన్నస్థాయిలో సబ్బులు, పెన్నులు, టూత్‌పౌడర్లు, బ్రష్షులు తయారుచేసి చిన్న పట్టణాలలో, గ్రామీణ మార్కెట్లలో అమ్ముకునే చిన్నతరహా పారిశ్రామిక సంస్థలు కుప్పకూలిపోయాయి. ఆ సంస్థల కార్మికులు వీధుల్లో పడ్డారు. బహుళజాతి సంస్థల సరుకులు ఎంతటి విశ్వరూపం ప్రదర్శిస్తున్నాయంటే టూత్‌పేస్ట్, పౌడర్, బ్రష్‌ల మార్కెట్‌లో సంఘటిత రంగంలో 85 శాతం అమ్మకాలను కేవలం రెండే బహుళ జాతి సంస్థలు-కోల్గేట్, హిందుస్తాన్ లివర్ శాసిస్తున్నాయి. ❍

(9వ పేజీ తరువాయి)

ఆజ్యం పోసిందో ఒప్పుకుని, ఈ దేశ దళిత, వెనుకబడిన వర్గాల క్షమాపణ కోరేదాకా కాంగ్రెస్‌కు సామాజిక సాధికారత గురించి మాట్లాడే అర్హతలేదు.

ఈ మౌలిక ప్రాతిపదికలేవీ లేకుండా, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పిస్తానని అనడం అమలులోకి రాని ఎన్నికల వాగ్దానమే అవుతుంది. కాంగ్రెస్ ఆ మాట అన్నంత మాత్రాన్నే, ఆ పార్టీకి ఆ విషయంలో చిత్తశుద్ధి ఉన్నదని నమ్ముతూ, కాంగ్రెస్ పట్ల భ్రమలు కల్పించడం వెనుకబడిన కులాల, దళితుల నాయకులకు, వ్యాఖ్యాతలకు తగినది కాదు.

విద్యుత్ సరఫరాలో లోటు ఉండబోదని, రైతులకు తక్కువ వడ్డీతో రుణం అందజేస్తామని, తగిన నీటిపారుదల సౌకర్యాలు, గిట్టుబాటు ధరలు, పంచాయతీరాజ్ సంస్థలకు స్వయం ప్రతిపత్తి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, అందరికీ ఆహార, పోషకాహార భద్రత, అసంఘటిత రంగంలోని కార్మికులకు సామాజిక బీమా పథకాలు, భూసంస్కరణలను త్వరితంగా అమలుచేయడం, దళితులు, ఆదివాసులు, ఒ.బి.సి.లు మైనారిటీల ఆర్థిక, సామాజిక అభ్యున్నతి కార్యక్రమాలు, మహిళా సశక్తీకరణ్ సంకల్ప్, బలహీన వర్గాల పిల్లలకు రుణ, స్కాలర్‌షిప్ పథకాలు, వ్యవసాయ, పరిశ్రమ, సేవారంగాలు పోటీపడేలా ఆర్థిక సంస్కరణలు-సిమ్లా సంకల్ప్ చదువుతుంటే కాంగ్రెస్ అరచేతిలో స్వర్గాన్ని చూపుతున్నదనిపిస్తుంది.

కాని కనీసం 1971 ఎన్నికల నుంచి ఇప్పటివరకూ ముప్ఫై సంవత్సరాలలో జరిగిన ఏడెనిమిది సార్వత్రిక ఎన్నికలలోను, రాష్ట్ర శాసనసభ ఎన్నికలలోను ప్రణాళికలలో ఉన్న వాగ్దానాలకూ ఈ అంశాలకూ ఏమీ తేడా లేదు. మూడు దశాబ్దాలలో కాంగ్రెస్ రెండు దశాబ్దాలకు పైగా అధికారంలో ఉంది గాని ఈ వాగ్దానాలలో పదోవంతు కూడా అమలులోకి రాలేదు.

అంటే ఈ ప్రజానుకూల, ప్రజాకర్షణ వాగ్దానాలన్నీ కూడ కాంగ్రెస్ అవలంబించే అవకాశవాద రాజకీయాలలో భాగమే. కేంద్ర ప్రభుత్వం అధికారం కోసం, ఇంకా ఎక్కువ రాష్ట్రాలలో అధికారం కోసం వెంపరలాడుతున్న కాంగ్రెస్, ఆ అధికారానికి మార్గం ఇంకా ఎక్కువ అవకాశవాదాన్ని ప్రదర్శిస్తేనే ఎక్కువ మందిని, ఎక్కువ వోట్లను ఆకర్షించగలనని నమ్ముతున్నట్టుంది. ❍

ఐక్య సంఘటన వ్యూహం-ఎత్తుగడలు

- కొల్లి సత్యనారాయణ

(గత సంచిక తరువాయి)

యూరప్ మొత్తం కమ్యూనిస్టుల చేతులలోకి పోతుందన్న భయం ఏర్పడగానే హడావుడిగా రెండవ యుద్ధరంగం తెరిచాయి. అందువల్లనే జర్మనీలో, రాజధాని బెర్లిన్‌తో సహా, సగభాగాన్ని సోవియట్ సైన్యాలు ఆక్రమించుకుంటే, బ్రిటిష్, ఫ్రెంచ్, అమెరికా సైన్యాలు మిగిలిన సగభాగాన్ని ఆక్రమించుకున్నాయి.

మాస్కో పట్టణాన్ని అద్దంలో చూడవలసిందే గానీ, మాస్కోలో అడుగుపెట్టలేవని సోవియట్ ప్రజలు చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టు కున్నారు. మాస్కోను విడిచిపెట్టి, స్టాలిన్ గ్రాడ్‌ను పట్టుకోవాలని హిట్లర్ ఎత్తువేశాడు. స్టాలిన్ గ్రాడ్‌ను పట్టుకుంటే పశ్చిమ ఆసియాలోకి, తద్వారా ఆసియాలోకి రహదారి ఏర్పడుతుంది అని అతని పథకం. జపాన్ అప్పటికే ఆగ్నేయ ఆసియా ప్రాంతాన్ని ఆక్రమించి, ఇండియా సరిహద్దు వరకూ వచ్చాడు. బర్మాను ఆక్రమించాడు. తూర్పునుంచి తాను, పడమర నుంచి హిట్లర్‌వచ్చి న్యూ ఢిల్లీలో చేతులు కలపాలని ప్లాను, ఆ విధంగా సోవియట్ యూనియన్‌ను చుట్టుముట్టవచ్చునని ఫాసిస్టుల పథకం.

ఈ ప్రమాదాన్ని గుర్తించిన సోవియట్ యూనియన్, స్టాలిన్ గ్రాడ్ వద్ద తన బలాన్ని పూర్తిగా కేంద్రీకరించింది. ఏ పరిస్థితులలోను స్టాలిన్ గ్రాడ్ ఫాసిస్టుల హస్తగతం కాకూడదన్న దృఢ దీక్ష పట్టారు. ప్రతి వీధి, ఇల్లు, ప్రతి ఇల్లు, ఇంట్లో ప్రతి గదీ ఒక యుద్ధరంగంగా మార్చారు. స్వయంగా స్టాలిన్ యుద్ధ రంగంలోకి వచ్చాడు. నాయకత్వం వహించాడు. ఫాసిస్టు మూకలను చిత్తుగా ఓడించటమే గాక, తిరిగి బెర్లిన్ చేరేవరకు వెంటబడి తరిమారు. ఫాసిస్టు ప్రమాదం నుండి ప్రపంచాన్ని కాపాడారు. ఇదీ గత చరిత్ర.

నేటి పరిస్థితి ఏమిటి?

సోషలిస్టు శిబిరం అంటూ లేకుండా పోయింది. సోషలిస్టు దేశాలు అని చెప్పుకునేవి కూడా అంతర్జాతీయ దృక్పథాన్ని విడిచిపెట్టాయి. దేశ సరిహద్దులకే పరిమితమౌతున్నాయి. కార్మికవర్గ ప్రభుత్వం అని చెప్పుకోవడానికి సిగ్గు పడుతున్నాయా అన్నట్లుగా తమ తమ రాజ్యాంగాలను, పార్టీల నియమావళిలను మార్చుకుంటు న్నాయి. నలుగురితో పాటు నారాయణ అంటున్నాయి.

కమ్యూనిస్టు దేశాల పరిస్థితి ఈ విధంగా వుంటే, సామ్రాజ్యవాద దేశాలు రెండుగా చీలిపోయాయి. ఒక శిబిరానికి అమెరికా నాయకత్వం వహిస్తోంది. ఈ శిబిరంలో రవి అస్తమించని సామ్రాజ్యాన్ని ఏలిన బ్రిటిష్ ప్రభుత్వం అమెరికాకు ఉపగ్రహంగా తయారైంది. కూటమిలో జపాన్, ఆస్ట్రేలియా, ఫిలిప్పీన్స్, ఇటలీ వంటి దేశాలు చేరాయి. రెండవ శిబిరానికి ఫ్రాన్స్, జర్మనీలు నాయకత్వం వహిస్తున్నాయి. రష్యా, చైనాలు వీటికి వంత పలుకుతున్నాయి.

ప్రపంచీకరణ పేరుతో అమెరికా ఏకధృవ ప్రపంచాధిపత్యం కోసం కృషి చేస్తున్నది. ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి వంటి ప్రపంచ ఆర్థిక సంస్థలను గుప్పిట్లో పెట్టుకొని ప్రపంచంలోని అన్ని దేశాలలో మార్కెట్లను కంట్రోలు చేస్తున్నది. తన చెప్పుచేతులలో వుండని దేశాలపై "టెర్రరిజం" ముద్రవేసి, దాడిచేసి ఆ దేశాలను నాశనం చేస్తున్నది. ప్రభుత్వాలను కూలద్రోసి తన తొత్తులను అందలమెక్కిస్తున్నది.

రెండవ సామ్రాజ్యవాద శిబిరానికి ఫ్రాన్స్, జర్మనీలు నాయకత్వం వహిస్తున్నాయి. అమెరికా పెత్తనం నుండి బయటపడటానికి కృషి చేస్తున్నవి. యూరోపియన్ యూనియన్‌ను ఏర్పాటు చేశాయి. డాలర్‌కు పోటీగా యూరప్ నాణెంగా "యూరో"కు రంగం మీదకు తీసుకొచ్చాయి. నిన్నటివరకు 'కమ్యూనిజాన్ని నిలువరించండి" అన్న నినాదం యూరప్‌లో మారుమ్రోగితే నేడు "అమెరికాను నిలువ రించండి" అన్న నినాదం మారుమ్రోగుతుంది. ఆర్థికంగా అమెరికాతో యుద్ధానికి తలపడుతున్నాయి.

ఇదిలా వుండగా అమెరికాలోని బడా బహుళజాతి సంస్థలు దివాళా తీసినట్లు ప్రకటించి కోట్లాది రూపాయలు గల్లంతు చేసిన కుంభకోణాలు ఒకదాని తరువాత ఒకటి వెలుగులోకి వచ్చాయి. అప్పటికే 1930 దశకంలో వచ్చిన ప్రపంచ ఆర్థిక సంక్షోభం కంటే తీవ్రమైనది. అమెరికా ఆర్థిక వ్యవస్థను చుట్టుముట్టి వున్నది. దానితో ప్రజలకు అమెరికన్ సంస్థలపై విశ్వాసం సడలింది. అవినీతి రాజ్యమేలుతోంది. పరిశ్రమలు మూతపడ్డాయి. నిరుద్యోగం పెరిగిపోయింది.

చమురు ఎగుమతి, అమ్మకాల ద్వారా వచ్చే ధనాన్ని చమురు ఎగుమతి చేసే దేశాలు (ఒపెక్) తమ నిధులను డాలర్ల రూపంలో అమెరికన్ బ్యాంకుల్లో, సంస్థలలో డిపాజిట్లు చేస్తారు. అందులో ఇరాక్ కూడా వుంది. ఐ.రా.స. 1991లో విధించిన షరతుల ననుసరించి చమురు అమ్మకం ద్వారా వచ్చే ధనాన్ని ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో అమెరికాలో డాలర్లలో నిల్వచేసి, అందులోనుండి తమకు అవసరమైన ఆహారం, ఇతర వస్తువులను కొనుగోలు చేసుకోవాలి. ఈ మధ్యకాలంలో తమ నిధులను ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోనే "యూరో" రూపంలోకి మార్చింది. ఇరాన్ కూడా ఈ పద్ధతినే అనుసరించింది. ఇదే విధానాన్ని మిగిలిన అరబ్ దేశాలు కూడా అనుసరిస్తే, సంక్షోభంలో వున్న అమెరికన్ ఆర్థిక వ్యవస్థ మరింత క్షీణించటమే కాకుండా, మార్కెట్‌లో యూరో విలువ పెరిగి డాలర్ విలువ పతనమయ్యే ప్రమాదం కూడా ఏర్పడింది. ఇరాక్‌పై తక్షణం దాడికి ఇది కూడా ఒక బలమైన కారణం. ఇప్పుడు ఇరాక్ పతనమైంది గనుక, డాలర్‌ను యిది రక్షిస్తుందేమో చూడవలసివుంది.

ఇరాక్‌పై దాడి విషయంలో ఈ రెండు శిబిరాల మధ్య వైరుధ్యాలు మరింత ఎక్కువగా వెలుగులోకి వచ్చాయి. ఐక్యరాజ్య సమితి అనుమతి వున్నా లేకపోయినా ఇరాక్‌పై దాడిచేసి తీరుతానని అమెరికా బహిరంగం గానే ప్రకటించింది. చివరకు ఆ విధంగానే దాడిచేసి ఇరాక్‌ను ధ్వంసం చేసింది. అయితే, ఇరాక్‌పై అమెరికా చేసిన ఆరోపణలు ఒక్కటీ రుజువు కాలేదు.

ఫ్రాన్స్, జర్మనీ, రష్యాలు ఇరాక్‌పై దాడికి తొందరపడవద్దని ఐక్యరాజ్యసమితి ద్వారానే సమస్య పరిష్కరించాలని కోరాయి. భద్రతా మండలిలో అమెరికా తీర్మానాన్ని వ్యతిరేకించాయి. అయినా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియాలు దాడి జరపనే జరిపాయి. ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, చైనాలు దాడి చేయటాన్ని మాత్రం వ్యతిరేకించాయి గానీ, ఆచరణలో ఇరాక్‌కు ఎలాంటి సహాయం చేయలేదు. పైగా మెతకబడ్డాయి. ఇప్పుడు ఇరాక్ పునర్నిర్మాణం మాత్రం ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలోనే జరగాలని మళ్ళీ కోరుతున్నాయి. అందుకు అమెరికా ససేమిరా అంగీకరించటం లేదు. తన మాజీ సైనికాధికారి మేజర్ జనరల్ గార్నర్ నాయకత్వంలో పునర్నిర్మాణ కార్యక్రమం జరుగుతుందని, ఇరాక్‌లోని అన్ని జాతులతో కూడిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అమెరికా ప్రయత్నాలు చేస్తున్నది.

ఈ ప్రయత్నాలకు ఇరాక్‌పై ఆంక్షలు విధిస్తూ ఇంతకుముందు ఐక్యరాజ్యసమితి ఆమోదించిన తీర్మానం అడ్డంకిగా వుంటే, ఆ ఆంక్షలను ఎత్తివేయమని కోరుతూ అమెరికా తీర్మానం తీసుకొస్తే, మొదట్లో వ్యతిరేకించినా, కొద్దిపాటి సవరణలతో ఆ తీర్మానాన్ని అందరూ ఆమోదించారు. దీనితో ఇరాక్‌లో పెట్రోలు అమ్మకాలు, పరిశోధన మొదలైన విషయాలలో అమెరికాకు పూర్తి స్వేచ్ఛ లభిస్తుంది. సిరియా ఒక్కటే ఈ సమావేశంలో పాల్గొనకుండా తన నిరసనను తెలియజేసింది.

ఇరాక్‌లో పెట్రోలులో వాటాకోసమే ఫ్రాన్స్, జర్మనీ, రష్యాలు అమెరికాతో తగాదా పడుతున్నాయి. కానీ, అమెరికాను కాదని పూర్తిగా ఎదిరించే దమ్ములు ఈ దేశాలకు లేకుండా పోయాయి. సోషలిస్టు శిబిరం లేకుండా పోవటమే అందుకు కారణం.

ఎప్పుడైతే ఇరాక్‌పై ఎదురులేని విజయాన్ని అమెరికా సాధించిందో ఇంక పెట్రోలు నిల్వలున్న సిరియా, ఇరాన్‌లను బెదిరించటం ప్రారంభించింది. టెర్రరిస్టు రాజ్యాలుగా ప్రకటిస్తానని ఈ దేశాలతో పాటు, తనకు ఎదురు మాట్లాడుతున్న ఉత్తర కొరియాను, క్యూబాను కూడా అమెరికా బెదిరిస్తోంది.

ఈ హెచ్చరికలతో ఏకధృవ ప్రపంచం తన ఆధిపత్యం క్రింద ఏర్పాటు తథ్యమని విర్రవీగుతోంది.

మూడో ప్రపంచం పరిస్థితి ఏమిటి?

మూడో ప్రపంచ దేశాలు, సామ్రాజ్యవాదుల బహుళజాతి సంస్థల, స్వదేశీ పెట్టుబడిదారుల దోపిడీకి, అణచివేతకు గురవుతూనే వున్నాయి. వనరుల దోపిడీకి మాత్రమే కాకుండా, సరళీకరణ, ప్రైవేటీకరణ వంటి సంస్కరణల ద్వారా, ప్రపంచ వాణిజ్య సంస్థ వంటి వాటి ద్వారా, మరింతగా దోపిడీకి గురవుతున్నాయి. ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి వంటి ఆర్థిక సంస్థల ద్వారా అప్పుల ఊబిలోకి నెట్టబడుతున్నాయి. మరింత పేద దేశాలు అవుతున్నాయి. వలస, అర్ధవలస దేశాలుగా మారుతున్నాయి.

తమ స్వాతంత్ర్యం, సార్వభౌమాధికారాల కోసం పోరాటాలు కొనసాగిస్తున్నాయి. ఇంతకుముందు సోవియట్ యూనియన్, సోషలిస్టు శిబిరం వుండగా వీటికి నైతిక మద్దతు లభించేది. సోవియట్ యూనియన్, సోషలిస్టు శిబిరం పోయినా, సోషలిస్టు చైనా అండగా వుంటుందని గంపెడంత ఆశ పెట్టుకున్నాయి. ఆ ఆశ అడియాస అయ్యింది. ఇంక స్వంత కాళ్ళపై ఆధారపడటం ఒక్కటే మిగిలింది. ఆ చైతన్యం ఈ దేశాల ప్రజలలో పెరిగింది.

ఆయా దేశాల ప్రభుత్వాలు సామ్రాజ్యవాదులకు దాసోహమన్నా, ప్రజలు తమ హక్కుల పరిరక్షణకు, తమ విముక్తి కోసం పోరాటాలు కొనసాగిస్తూనే వున్నారు. అమెరికన్ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా బలంగా తమ గళాలను విప్పుతున్నాయి. బహిరంగంగా వీధులలోకి వచ్చి తమ వ్యతిరేకతను తెలియజేస్తున్నాయి. ఒక కేంద్రీకృత నాయకత్వం లేకపోయినప్పటికీ, ఈ దేశాల ప్రజలు ఈ విధంగా చైతన్యవంతులై ముందుకు రావటం నూతన పరిణామంగా భావించాలి.

ఈ శక్తులను సంఘటితపరచి ఒకే వేదికపైకి తీసుకురావలసిన బాధ్యత ప్రపంచంలోని విప్లవసంస్థలపై ఉంది. ఈ ప్రజాఉద్యమాలను ఏకీకృతం చేయటానికి ఇటీవల కాలంలో భారతదేశంలోని విప్లవ సంస్థలు కొన్ని సమావేశమై "సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వ్యతిరేక వేదిక" (ఫేగ్)ను ఏర్పాటు చేశాయి. ఈ వేదికను బలోపేతం చేయ వలసిన, చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. దీనిని ప్రపంచ ప్రజల ఈనాటి ప్రధాన శత్రువైన అమెరికన్ సామ్రాజ్యవాద వ్యతిరేక ఫ్రంట్‌గా రూపుదిద్దాలి. ఈ ఫ్రంట్‌కు యూరోపియన్ యూనియన్ వంటి పెట్టుబడిదారీ దేశాలను మిత్రదేశాలుగా కలుపుకురావాలి.

అయితే, యూరోపియన్ యూనియన్‌లోని దేశాలు కూడా సామ్రాజ్యవాద దేశాలు కదా, అటువంటప్పుడు ఫ్రంట్ కట్టడం సబబా? రేపు అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని ఓడించిన తరువాత, ఈ సామ్రాజ్యవాద దేశాలే అధికారంలోకి వస్తాయి కదా? అన్న ప్రశ్నలు ఉదయించటం సహజం.

యూరోపియన్ యూనియన్ దేశాలు కూడా సామ్రాజ్యవాద దేశాలు అన్నమాట వాస్తవం. అయితే, ఈ దేశాలు, తమ స్వార్థం కోసం అమెరికన్ సామ్రాజ్యవాదంతో విభేదిస్తున్నాయి. కొంతమేరకు పోరాడుతున్నాయి. వాటిమధ్య వున్న ఈ వైరుధ్యాన్ని ప్రజాశక్తులు ఉపయోగించుకోవాలా వద్దా? అలా ఉపయోగించుకోవాలని కదా మార్క్సిస్టు మహోపాధ్యాయులు చెప్పింది. అందువల్ల అలా ఉపయోగించుకొనక పోవటం తప్పు అవుతుంది కదా? ఒకే పర్యాయం శత్రువులందరితోనూ పోరాడటం ఒంటెత్తు పోకడ అవుతుంది కదా?

ఇక్కడ ఒక విషయం మనం గుర్తుంచుకోవాలి. శత్రువుతో పోరాడేటప్పుడు వ్యూహం, ఎత్తుగడలు అనే రెండు విషయాలు వుంటాయని మనకు తెలుసు. ఇవి రెండూ ఒకదానికొకటి వ్యతిరేకం కాదు. పైగా ఒకటే. మొదటిది ఆలోచన. రెండవది ఆచరణ. ఆలోచనను బట్టి ఆచరణ వుంటుంది. ఆలోచన మారినప్పుడల్లా ఆచరణలో మార్పులు ఉంటాయి. అంటే ఆలోచనకు లోబడి ఆచరణ వుంటుంది. అప్పటి పరిస్థితులను బట్టి ఆలోచన వుంటుంది. పరిస్థితిలో పూర్తి మార్పు వచ్చేవరకు ఆలోచన ఒకే రకంగా వుంటుంది. అంటే ఒక దశవరకు ఆలోచన (వ్యూహం) ఒకేవిధంగా వుంటుంది.

ఆ ఆలోచనను ఫలప్రదం చేయటానికి అనుసరించేది ఆచరణ. అంటే ఎత్తగడలు అని చెప్పవచ్చు. ఆ దశలో ఆ వ్యూహం మార నప్పటికీ అవసరాన్ని బట్టి, ప్రాంతాన్ని బట్టి ఎత్తుగడలు మారుతూ వుంటాయి. అయితే ఆ మార్పు ఆ వ్యూహం పరిధిలోనే వుండాలి.

ఈ సూత్రాన్ని అనుసరించి, ప్రధాన శత్రువు ఎంపిక అనేది వ్యూహం క్రిందకు వస్తుంది. ఆ వ్యూహాన్ని అమలు జరిపేటప్పుడు అనుసరించేవి ఎత్తుగడలు. ఇప్పుడు యూరోపియన్ యూనియన్ దేశాలు మిత్ర దేశాలుగా పరిగణించటం అనేది ఎత్తుగడలకు సంబంధించినది. ఎత్తుగడలు సరియైనవి అయితే ఫలితం మనం ఆశించిన విధంగా వుంటుంది. లేకపోతే విరుద్ధంగా వుంటుంది.

ఇది మిత్రదేశాలతో వ్యవహరించేతీరుపై ఆధారపడివుంటుంది.

అసలు మిత్రులతో ఫ్రంట్ కట్టడం ఎందుకు? ఫ్రంట్ కట్టకుండా ప్రధాన శత్రువుతో పోరాడి జయించలేమా? జయించలేము. ఎందుకని? మన ఒక్కరి బలమే చాలదు గనుక, మనతో ఉండవలసిన శక్తులు మన శత్రువుతోనూ, మిత్రులతోనూ కలసి వున్నవి గనుక. వారందరినీ మనవెనుక సమీకరించాలంటే, ఫ్రంటు కట్టడం అవసరం, తప్పనిసరి.

మిత్రులతో ఫ్రంట్ కట్టి ప్రధాన శత్రువుతో పోరాడి జయం పొందినప్పుడు, శత్రువు స్థానంలో ఇప్పుడు మనం మిత్రులుగా భావించే శత్రువులు అధికారంలోకి వస్తారు గదా? ఇది ఒక దొంగను తొలగించి, మరొక దొంగను తలకెత్తుకోవటం అవుతుంది గదా? అన్న ప్రశ్న ఎదురౌతుంది.

మనం సరియైన ఎత్తుగడ అనుసరించకపోతే, ఆ విధంగా తప్పనిసరిగా జరిగి తీరుతుంది. మరి అటువంటప్పుడు వారితో ఫ్రంట్ ఏర్పాటు ఎందుకు? అన్న ప్రశ్న వెంటనే వస్తుంది. అసలు ఫ్రంట్ కట్టేటప్పుడు మన వ్యక్తిత్వాన్ని, చొరవను వదులుకొని ఫ్రంటు కట్టటం తప్పు అవుతుంది.

అయితే ఫ్రంట్ ఎలా వుండాలి? అన్నది ప్రశ్న. ప్రధాన శత్రువుతో మనం పోరాడేటప్పుడు, మిత్రపక్షాలుగా భావించేవారు కూడా ప్రధాన శత్రువుతో పోరాడటానికి కూడా సిద్ధంగా వుండాలి. అట్టివారితో ఫ్రంట్ కట్టడానికి మనం సిద్ధం కావాలి. మనం ఫ్రంట్ కట్టబోతున్నవారు దోపిడీ వర్గాలకు చెందినవారని, నిలకడగా శత్రువుతో చివరికంటా పోరాడరన్న విషయం మనం మరచి పోకూడదు. ఊగిసలాడుతూ వుంటారు. అవకాశం దొరికితే ప్రధాన శత్రువుతో చేతులు కలపటానికే ఎక్కువ ప్రాధాన్యత యిస్తారు. ఈ విషయాలను ఎన్నడూ మనం మరచిపోకూడదు.

మరి ఎలా వ్యవహరించాలి?

మిత్రులుగా వున్న వీరితో ఎలా వ్యవహరించాలి? అన్నది ప్రధాన సమస్య. మన వ్యక్తిత్వాన్ని విడిచిపెట్టి, చొరవను విడిచిపెట్టి, ఏ పరిస్థితులలోనూ వీరికి తోకగా తయారుకాకూడదు. వీరు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, ప్రజా శత్రువుకు అనుకూల విధానాలను నిశితంగా విమర్శించటంలో వెనుకాడకూడదు. గట్టిగా విమర్శిస్తే ఫ్రంట్ నుండి పోతారేమోనని వారికి తైనాతీలుగా, వారిని సంతృప్తి పరిచే విధంగా వ్యవహరించకూడదు.

అయితే విమర్శ చేయకూడదా? చేయాలి. నిశితంగా విమర్శించాలి, ఆ విమర్శ ఎలా వుండాలి, విమర్శ చేసేటప్పుడు ఆ వర్గాల వెనుకనున్న ప్రజలను దృష్టిలో వుంచుకోవాలి. నాయకులు అనుసరిస్తున్న విధానాలు ప్రధాన శత్రువుకు ఎలా ఉపయోగ పడతాయో ఓపికగా వివరించేటట్లు ఉండాలి. తప్పుదారిన పోతున్న వారి నాయకుల విధానాలను మార్పుచేసుకోమని విజ్ఞప్తిచేసే విధంగా వుండాలి. వారి అభిమానులు ఆలోచించే విధంగా వుండాలి. అంతే గాని, నాయకులకు వ్యతిరేకంగా అనుచరులను రెచ్చగొడుతున్నట్లుగా, నాయకులకు ద్వేషం కలిగేటట్లుగా వుండకూడదు. ఏ లక్ష్యంతో ఫ్రంట్ కట్టామో ఆ లక్ష్యాన్ని మరచిపోకూడదు. ❍

(7వ పేజీ తరువాయి)

జిల్లా ఆరోగ్య కేంద్రాల స్థితి ఇంతే. అనేక జిల్లా ఆసుపత్రుల్లో కార్డియాలజీ విభాగానికి సంబంధించిన వైద్యులు లేరు. ఉన్నవారికి కూడా కావలసిన ఎకోకార్డియోగ్రామ్, ట్రెడ్‌మిల్‌టెస్ట్, కరోనరీ యాండియోగ్రామ్ లాంటి ఆధునిక వ్యాధి నిర్ధారణ పరికరాలు లేవు. న్యూరాలజీ వైద్యులు కూడా అవసరమైనంత సంఖ్య లేదు. వారికి రొటీన్‌గా కావలసిన సి.టి. స్కాన్, ఇ.ఇ.జి.లు వుండవు. ఆంధ్రప్రదేశ్ మొత్తంలో సి.టి. స్కాన్ ఒక్క ఉస్మానియా ఆసుపత్రిలో తప్ప ఎక్కడా లేదు. విశాఖలోని కింగ్‌జార్జి ఆసుపత్రిలో కూడా సి.టి. స్కాన్ లేదంటే మన పాలకులు ప్రభుత్వాసుపత్రులను ఏవిధంగా అభివృద్ధిపరుస్తున్నారో అర్థం అవుతుంది.

ఒకవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్య రంగానికి కేటాయిస్తున్న బొటాబొటీ నిధుల కారణంగా ప్రభుత్వాసుపత్రిలో సేవలు, సౌకర్యాల కొరతను సృష్టిస్తూ మరొకవైపు వీటిని సమర్థవంతంగా నిర్వహించే పేరుతో కొన్ని విభాగాలను ప్రైవేటీకరణ చేస్తూ వినియోగ చార్జీల పద్ధతిని ప్రవేశపెడుతుంది. కాంట్రాక్టు డాక్టర్ల నియామకం, క్లీనింగ్, సెక్యూరిటీలను ప్రైవేటువారికి అప్పగించడం, ఇందులో భాగంగానే ప్రారంభం అయ్యాయి. దేశం మొత్తం మీద కొనసాగుతున్న ఈ ప్రైవేటీకరణ పోటీలు ఆంధ్ర రాష్ట్రంతో పాటు పశ్చిమ బెంగాల్ కూడా ముందువరుసలో వుంది.

అన్ని రంగాల్లో లాగే వైద్య రంగంలో ప్రైవేటీకరణ విధానాన్నే సమర్థించే వాదం వినబడుతుంది. మౌళిక సదుపాయాలు పెంచడం వల్ల చార్జీలను వసూలుచేయక తప్పడం లేదని అంటున్న ప్రభుత్వం సౌకర్యాలు పెంచింది ఏమీలేదు గాని, పెంచని సౌకర్యాలకు చార్జీలను వసూలు చేయడం ఆరునెలల వ్యవధిలో రెట్టింపు చేయటం జరిగిపోతుంది. దీనికితోడు వార్డ్‌బాయ్ నుండి డాక్టర్ల దాకా మామూళ్ళకోసం రోగిపైపడి చేసే ఒత్తిడి రాబందులను మరిపిస్తుంది.

ఇన్నేళ్ళుగా సరిపోయినంతకాకపోయినా ప్రభుత్వ రంగంలో ఒకమేరకు అభివృద్ధి అయిన మౌళిక వైద్య సదుపాయాల్ని సేవల నిర్వహణను, ఒక పద్ధతి ప్రకారం క్రమంగా నిర్వీర్యపరుస్తూ వాటిని సర్వనాశనం చేసి ప్రైవేటు రంగానికి అప్పగించాలని ప్రయత్నాల్ని కొనసాగిస్తుంది. ఆ ప్రయత్నం చివరిదశకు చేరుకుందిప్పుడు.

అంతర్జాతీయ దోపిడీదారులకు దళారులుగా మారిన భారత పాలకవర్గాలు ప్రపంచ బ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థ వంటి అంతర్జాతీయ వ్యాపార సంస్థల ఆదేశాలు తప్ప దేశ ప్రజల ఆక్రందనను పట్టించుకోవడంలేదు. గత పక్షం రోజులుగా కొనసాగుతున్న పసిపిల్లల మరణాలు వారితల్లిదండ్రుల ఆక్రందనలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనాలే. ❍

"**ఆకలిచావులకు** కారణం ఆహార కొరత కాదు. మన పంపిణీ వ్యవస్థ లోపం. ఒకవైపు ధాన్యపు రాసులు ఉన్నా, మరోవైపు ఆకలి చావులు సంభవిస్తున్నాయి. ఆహారోత్పత్తి పెరగడమే కాదు, అవి పేదలకు చేరడం ప్రధానం"

– భారత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి

"**మా ప్రభుత్వం** లంచగొండితనానికి వ్యతిరేకంగా సాగిస్తున్న ప్రయత్నాలను విమర్శించే బదులు, బిజెపి పాలిత రాష్ట్రాలైన ఉత్తర ప్రదేశ్, హర్యానాల్లో జరిగే వ్యవహారాలపై దృష్టి సారిస్తే మంచిది"

– వెంకయ్య నాయుడుకు పంజాబ్ ముఖ్యమంత్రి జవాబు

"**రాష్ట్రంలో** సంక్షేమ హాస్టళ్ళు అధ్వాన్నంగా వున్నాయి. గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్వహించే ఆశ్రమ, గిరిజన హాస్టళ్ళు గిరిజన సంక్షేమ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. ముంబైలోని వ్యభిచార గృహాల్లో అధికశాతం ఆంధ్ర అమ్మాయిలే"

– జాతీయ మహిళా కమీషన్ చైర్ పర్సన్ పూర్ణిమా అద్వానీ

"**ఇండియా,** పాకిస్తాన్ చర్చించుకొంటున్నారు, మంచిదే కాని జమ్మూ-కాశ్మీర్‌ను దూరంగా వుంచటం మంచిది కాదు. దాని ప్రమేయం కూడా వుండాలి"

– 11 మంది సభ్యులుకల పి.డి.ఎఫ్. నాయకుడు మహమ్మద్ యూసుఫ్ తరిగామి

"**ధనవంతమైన** దేశాలు ఆఫ్రికాకు ధనసహాయం అందజేస్తు న్నారు, సంతోషం. కాని మాకు కావలసింది అమెరికన్ మార్కెట్‌లో ఆఫ్రికా ఉత్పత్తులు అమ్మటానికి వీలుగా అమెరికా రైతులకిస్తున్న సబ్సిడీలను ఉపసంహరించాలి. లేకపోతే ఆఫ్రికా దేశాలు పండించే పత్తిపోటీకి తట్టుకోలేదని ఆఫ్రికన్‌నాయకులు బుష్‌కు తెలియజేశారు"

– న్యూయార్క్ టైమ్స్

"**తాము** టూరిస్టులకు ఎటువంటి హాని తలపెట్టబోమని మావోయిస్టులు స్పష్టం చేశారు. టూరిస్ట్ రంగాన్ని వాళ్ళెపుడూ భంగపరచలేదు"

– నేపాల్ టూరిజం మంత్రి సర్వేంద్రనాథ్ శుక్లా

"**వాజ్‌పేయి,** అద్వానీ, మురళీమనోహర్ జోషీ, కె.ఎస్. సుదర్శన్, ఆర్.ఎస్.ఎస్. నేత రజ్జు భయ్యా, అశోక్ సింఘాల్, గిరిరాజ్ కిశోర్ అంతా నాకు వ్యతిరేకంగా కుట్రపన్నారు. నన్ను నమ్మించి మోసం చేశారు. తప్పుడు అఫిడవిట్‌ను నాచేత సుప్రీం కోర్టులో సమర్పించేలా చేశారు"

– మాజీ బి.జె.పి. ముఖ్యమంత్రి కళ్యాణ్‌సింగ్

"**ఫాస్ట్** ట్రాక్ కోర్టులు (అత్యంత త్వరితంగా విచారించే కోర్టులు) నిజంగా త్వరితంగా పనిచేస్తున్నాయా లేక గోళ్ళు గిల్లుకొంటూ కూర్చుంటున్నాయా హైకోర్టులు విచారించాల్సి వుంది"

– సుప్రీం కోర్టు బెంచి

"**చైనాలో** అత్యంత ధనవంతుడు, పూల వ్యాపారి, డచ్ పౌరుడు ఫోర్బ్స్ పత్రిక చైనాలో రెండవ అత్యంత ధనవంతుడుగా పేరు పొందిన యాంగ్‌కు, లంచగొండితనం నేరానికి, ఫ్రాడ్ నేరానికి చైనా ప్రజాకోర్టు 18 సంవత్సరాల జైలుశిక్ష విధించింది"

– ఎ.పి. వార్తా సంస్థ

"**1998-2000** మధ్యకాలంలో ప్రపంచంలో 84 కోట్లమంది పోషకాహార లేమితో బాధపడుతున్నారు. చైనా జనాభా ఆ కాలంలో 74 లక్షల మేరకు తగ్గగా, భారతదేశంలో 180 లక్షల మంది పెరిగారు. భారతదేశం జనాభాలో 24 శాతం మంది పోషకాహార లేమితో కృంగిపోతున్నారు"

– 'ఎకనామిక్ టైమ్స్' ఇంటెలిజెన్స్

"(**కోర్టులలో** సాక్షులకు రక్షణ కల్పించినా కూడా న్యాయం తప్పక జరుగుతుందని అనుకోలేం. ఎందుచేతనంటే నేరుగా ప్రభుత్వమే న్యాయాన్ని తలకిందులు చేస్తుంది కాబట్టి"

– హర్ష్‌మందర్, యాక్షన్ ఎయిడ్ ఇండియా కంట్రీ డైరెక్టర్

"**పోలీసులు** లెక్కలు చూపించుకోవడానికి అన్నట్లు వేలసంఖ్యలో చిన్నపిల్లలపై 109 సి.ఆర్.పి.సి. సెక్షన్ కింద కేసులు నమోదు చేయడం సరికాదు. అనేకమంది ఉన్నత పదవుల్లో ఉన్నవారి ఇళ్ళల్లో బాల కార్మికులు పనిచేస్తున్నారు"

– సి.ఐ.డి., డి.జి. కుమావత్

"**ప్రపంచంలో** అన్ని దేశాల్లోకెల్లా భారతదేశంలోనే క్షయవ్యాధి రోగులు అత్యధికంగా వున్నారు"

– ప్రపంచ ఆరోగ్య సంస్థ

"*గత సంవత్సరం* జూన్ నాటికి దేశంలో ఉన్న జైళ్ళలో 2,32,412 మందికే చోటు వుండగా, 3,01,813 మంది బందీలుగా ఉన్నారు. ఇందులో 75 శాతం మంది నేరారోపణ నెదుర్కొంటున్న వాళ్ళు. ఇది ప్రాథమిక మానవ హక్కును అంటే శారీరకంగా బ్రతికే హక్కుకు విరుద్ధం"

– జాతీయ మానవహక్కుల కమీషన్ అధ్యక్షుడు జస్టిస్ జె.ఎస్. ఆనంద్

ఉచిత సౌకర్యాల జాబితాను ప్రకటించండి

'అంతా భరించి కేవలం రెండువందల యాభైకోట్ల సబ్సిడీ ఇవ్వడం ద్వారా రైతలకు ఉచిత విద్యుత్‌ను అందించడం ప్రభుత్వానికి అసాధ్యమైనదేమీ కాదని కాని అలా ఇస్తే అప్పులు పుట్టే మార్గం మూసుకుపోతుంద'ని ముఖ్యమంత్రి నిస్సిగ్గుగా ప్రకటించడం ప్రజలకు అవమానకరం. తన వాదనను సమర్థించుకోవడానికి ప్రజల్లో సోమరితనం పెంచే విధంగా ఉచితంగా లభించాలనే ధోరణి ప్రతిపక్షాలు అవలంబించరాదని ప్రతిపక్షాలకు నీతిపాఠాలు, ప్రజలకు శ్రమపాఠాలు బోధిండం తీవ్రఅభ్యంతరకరం. మంచినీటికి, మందుబిళ్లలకు, రోడ్డుకు, బడికి, కరెంటు వెలుగుకు, ఆఖరికి మూత్రశాలల్లో చేసే మూత్ర విసర్జనకు సైతం పైకం వసూలు చేస్తున్న ప్రభుత్వం తన బాధ్యతగా ప్రజలకందిస్తున్న సేవల జాబితానేదైనా ప్రకటించగలదా?

పాలెం శోభారాణి
వరంగల్
10-7-03

ఆపత్కాలంలో కూడా ఆదుకోరా

గత వారం పదిరోజులుగా రాష్ట్రంలో అంతుచిక్కని రోగంతో 150 మంది పసిపిల్లలు అకాల మృత్యువాత పడుతున్నారు. ప్రభుత్వాసుపత్రులన్నీ నిండుపోతున్నాయి. పిల్లల తల్లిదండ్రులు ఆసుపత్రుల్లో వైద్య సౌకర్యాల కొరతను, వసతుల కొరతను ఎదుర్కొంటున్నారు. అందీ అందని వైద్య సౌకర్యంతో మందులు కొనలేని పేదరికంతో కూడా పసిపిల్లలు మరణిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రైవేటు ఆసుపత్రులు, ప్రత్యేకించి కార్పొరేట్ ఆసుపత్రులు వైద్య సహాయాన్ని అందించడం లేదు. వారి వైద్య వ్యాపారాభివృద్ధికి కావలసిన భౌతిక పరిస్థితులను, ప్రోత్సాహకాలను ప్రత్యక్ష పరోక్షంగా ప్రభుత్వం నుంచి పొందుతున్నారు. భూమి, విద్యుత్తు, నీటి వాడకంపై సబ్సిడీలు అత్యాధునిక నివారణ యంత్రాలు విదేశాలనండి చేసుకునే దిగుమతుల్లో లక్షలు, కోట్ల రూపాయల సుంకాలలో రాయితీలను పొందుతున్నారు గదా! ఈ విధంగా సౌకర్యాలు పొందుతున్నప్పుడు వీళ్ళ ఆసుపత్రులు నడిచినంతకాలం వీటిలో 40 శాతం ఔట్‌పేషెంట్ మరియు 10శాతం ఇన్‌పేషెంట్స్‌కు ఉచిత వైద్య సదుపాయాలు కల్పించాలనే నిబంధన కూడా వుంది. కానీ రేపటి పౌరులుగా ఎదగాల్సిన చిన్నారుల బతుకులు అర్థాంతరంగా ఆరిపోతున్న ఈ ఆపత్కాల సమయంలోనైనా తమ నిబంధన మేరకైనా వైద్య సౌకర్యాన్ని అందించకపోవడం మహాపాపమే కాదు నేరం కూడా.

చింతా శ్రీకర్
విశాఖపట్నం
12-7-03

సోషలిస్టు వ్యవస్థ పతనానికి మార్క్సిస్టు వ్యతిరేక విధానాలే కారణం

మే నెల 'సమీక్ష' సంచికలో ప్రచురించిన డి. పాపారావు గారి "సోషలిజమే భవిష్యత్తు" అన్న వ్యాసంపై నా అభిప్రాయాలను రాస్తున్నాను.

సోషలిజం నిర్మాణదశలో సోషలిస్టు దేశాలు కూలిపోవడానకి పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పాదక శక్తులు అభివృద్ధి తగిన స్థాయికి చేరుకొనకపోవటమే కారణంగా ఆ వ్యాసంలో పాపారావు గారు పేర్కొన్నారు.

మార్క్సిస్టు మహోపాధ్యాయుల అంచనా ప్రకారం పెట్టుబడి దారీ వ్యవస్థలో ఉత్పాదక శక్తులు అభివృద్ధి చెందిన దేశాలలోనే విప్లవాలు వస్తాయని. ఆనాడున్న పరిస్థితిలో ఇంగ్లాండ్, జర్మనీ దేశాలలో విప్లవాలు రావటానికి అవకాశాలు మెండుగా వున్నాయని కూడా వారు ఊహించారు. కానీ పెట్టుబడిదారీ దేశంగా వెనుకబడి వున్న రష్యాలో విప్లవం వచ్చింది. జయప్రదంగా కార్మికవర్గం అధికారం చేజిక్కించుకుంది. ఆ రోజులలో కూడా ప్లెఖనోవ్, ట్రాట్స్కీ వంటి మేధావులు రష్యాలో విప్లవం విజయవంతం కాదని వ్యతిరేకించారు. ట్రాట్స్కీ ఒకడుగు ముందుకువేసి, ప్రపంచమంతా ఒకేసారి విప్లవం రావాలి గానీ, ఒకదేశంలో విప్లవం పనికి రాదని, విజయవంతం కాదని వాదించారు. కానీ, కామ్రేడ్ లెనిన్ ఆ వాదనలనన్నింటినీ త్రోసిపుచ్చి, పెటుబడిదారీ ప్రపంచ గొలుసులో ఏ లింకు బలహీనంగా వుంటే ఆ లింకును బద్దలు కొట్టాలని, ఒక దేశంలో విప్లవం వచ్చినా విజయవంతం అవుతుందని చెప్పి విప్లవాన్ని జయప్రదంగా నిర్వహించారు.

ఉత్పాదక శక్తులు తగినంత బలంగా లేని సమయంలోనే విప్లవం విజయవంతమైంది. అర్ధ శతాబ్దం పాటు జయప్రదంగా సోషలిజం నిర్మాణం జరిగింది. ప్రపంచంలో పలు దేశాలలో విప్లవం జయప్రదం కావటానికి తోడ్పడింది. ప్రపంచంలో అత్యధిక జనాభా గల, ఉత్పాదక శక్తుల అభివృద్ధి ఎంతో వెనుకబడివున్న చైనాలో కామ్రేడ్ మావో నాయకత్వాన విప్లవం విజయవంతమైంది. సోషలిజం నిర్మాణంలో ఎన్నో విజయాలను సాధించింది. ప్రపంచంలో కమ్యూనిస్టు శిబిరం ఏర్పడటానికి తోడ్పడింది. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థకు సవాల్‌గా నిలిచింది. బడుగు దేశాలకు అండగా నిలబడింది.

దీనినిబట్టి సోషలిస్టు వ్యవస్థ కూలిపోవడానికి ఉత్పాదక శక్తులు తగినంతగా అభివృద్ధిచెందకపోవటం కారణంకాదని స్పష్టమౌతున్నది.

అదేవిధంగా సమాచార, సాంకేతికరంగాల సోషలిస్టు వ్యవస్థకు కావలసిన రీతిలో అభివృద్ధి చెందకపోవటం సోషలిస్టు వ్యవస్థలు కూలిపోవటానికి మరొక కారణంగా పాపారావు తమ వ్యాసంలో పేర్కొన్నారు.

సమాచార, సాంకేతికరంగం రెండు దశాబ్దాల నుండి మాత్రమే అభివృద్ధి చెందింది. ఈ రంగం అభివృద్ధి చెందకపోవటం వల్ల సోషలిస్టు రాజ్యాలలో ప్రజలకు, నాయకులకు మధ్య సమాచార సంబంధాలు లేక, బ్యూరోక్రసీ సోషలిస్టు ప్రభుత్వాలు కూలిపోవ టానికి మరొక కారణంగా పాపారావు పేర్కొన్నారు.

ఈ వ్యాసకర్త ఒక విషయాన్ని ఇక్కడ మరచిపోతున్నారు. ఈ సమాచార, సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందని, పారిశ్రామికంగా వెనుకబడిన, ప్రపంచంలోనే విశాల భూభాగం కలిగిన రష్యాలో విప్లవాన్ని విజయవంతం చేయటం ఎలా సాధ్యమైందో అన్న విషయం మరచినట్లున్నారు. విప్లవ రథసారథి కామ్రేడ్ లెనిన్ సైబీరియాలో ప్రవాసం వున్నాడు. అసలు విప్లవం ప్రారంభమైన తరువాతనే రష్యాలో అడుగుపెట్టాడు. అటువంటి రవాణా సౌకర్యాలు కూడా లేని రష్యాలో విప్లవానికి ఎలా సారధ్యం వహించగలిగాడు? స్వపార్టీలోనే వ్యతిరేక వాదనలు బలంగా వున్నా, వాటిని ఖండించి తన వాదన సరియైనదని సమాచార, సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందని దేశంలో ప్రజల్ని ఎలా సమీకరించగలిగాడు?

అదే విధంగా ప్రపంచంలోనే అత్యధిక జనాభాగల చైనా, సమాచార, సాంకేతిక రంగాలలో పూర్తిగా వెనుకబడి వుండటమే కాకుండా, రవాణా సౌకర్యాలు అరకొరగా వున్న కోట్లాది చైనా ప్రజలను నల్లమందు భాయిలుగా పేరుపొందిన కోట్లాది ప్రజలను మావో ఎలా నడిపించగలిగాడు? సంవత్సరాలతరబడి కమ్యూనిస్టులు చైనాలో ఏమి చేస్తున్నారో బయటి ప్రపంచానికి తెలియని సమయంలో 'ఎడ్గార్ స్నో' చైనాలో పర్యటించి, ఏనాన్ కొండ గుహలలో తలదాచు కుంటూ విప్లవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న కమ్యూనిస్టులను కలుసుకుని "రెడ్‌స్టార్ ఓవర్ చైనా" అన్న గ్రంథాన్ని (చైనాపై అరుణతార) ప్రచురించే వరకు బయటి ప్రపంచానికి తెలియని పరిస్థితి వున్నప్పుడు, ఒకప్రక్క ఫాసిస్టు జపాన్‌తో, రెండవప్రక్క జంకైషేక్ ప్రభుత్వంతో పోరాడుతూనే, విప్లవాన్ని మావో ఎలా జయప్రదం చేయగలిగాడు?

ఈ విషయాలను మరచిపోయి కాదు కాదు కమ్యూనిస్టు వ్యవస్థ కూలిపోవటానికి మూల కారణాలను మభ్యపెట్టి, తప్పుడు కారణాలను ప్రజల ముందుంచటానికి ప్రయత్నించటమే అవుతుంది.

అసలు కమ్యూనిస్టు పాలన రష్యాలోనూ, చైనాలోనూ ఎప్పుడు కూలిపోయాయి?

రష్యాలో స్టాలిన్ చనిపోయిన తరువాత అధికారంలోకి వచ్చిన కృశ్చేవ్ ముఠా, చైనాలో మావో చనిపోయిన తరువాత అధికారంలోకి వచ్చిన టెంగ్‌జియావోపింగ్ ముఠా అనుసరించిన విధానాలు వ్యవస్థ కూలిపోవటానికి బీజాలు పడ్డాయి. కార్మికవర్గ రాజకీయాలను, ప్రజానుకూల కార్యక్రమాలను విడిచిపెట్టి ప్రజా వ్యతిరేక, కార్మికవర్గ వ్యతిరేక విధానాలను చేపట్టిన తరువాతనే రష్యాలో గానీ, చైనాలో గానీ సోషలిస్టు వ్యవస్థలు కూలిపోవటం ప్రారంభమైంది. రష్యాలో గోర్బచేవ్ అధికారంలోకి వచ్చి అసలు కమ్యూనిస్టు పార్టీని నాశనం చేసే విధానం అనుసరిస్తే, ఎలిత్సిన్ వచ్చి కమ్యూనిస్టు పార్టీకి మంగళం పాడాడు. చైనాలో పింగ్ తరువాత అధికారంలోకి వచ్చిన హుజింటావో కార్మికవర్గ పార్టీ కాదని, రాజ్యాంగాన్నే మార్చివేసిన విషయాలను మరుగుపరచటానికి, ఈ కొత్త కారణాలు తోడ్పడ్డాయి. కమ్యూనిస్టు పార్టీల నాయకత్వ స్థానాలను సోషల్ డెమోక్రాట్స్ ఆక్రమించుకోవటం, దోపిడీ వర్గాల విధానాలను అమలుజరపటం వల్లనే సోషలిస్టు వ్యవస్థలు కూలిపోయాయి.

ఈ దేశాలలో యిప్పుడున్న ప్రభుత్వాలు అనుసరిస్తున్న పెట్టుబడిదారీ విధానాలే అందుకు కారణం. చరిత్రలో సోషలిస్టు డెమోక్రాట్ల పాత్ర యిదే. ఫాసిస్టు శక్తులు మారణాయుధాలతో పెద్దఎత్తున దాడిచేసి ఘోర పరాజయం పొందగా, ఈ ముఠా ఒక్క తపాకిగుండు కూడా పేల్చకుండా, రష్యా వ్యవస్థను కూల్చివేశాయి. లోగడా ఇది రుజువైంది, ఇప్పుడూ రుజువైంది. అందుకే లోగడ వచ్చిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని 1925 లోనే అంతర్జాతీయ కమ్యూనిస్టు కేంద్రం 'కోమింటరన్' "కమ్యూనిస్టు పార్టీలను బోల్షివీకరించాలి అని తీర్మానం చేసింది.

అందువల్ల ప్రస్తుతం వున్న ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మికవర్గ వ్యతిరేక విధానాలను మార్చటమే తక్షణకర్తవ్యం. సమాచార, సాంకేతిక రంగాల అభివృద్ధి అందుకు యిప్పుడు చక్కగా ఉపయోగపడుతుంది. ○

అంతర్ జలసంధి మళ్ళింపులు - జాతీయ ప్రయోజనాలు

— యం.యస్. రెడ్డి
(కేంద్ర జలవనరుల సంఘం మాజీ కార్యదర్శి)

నీరు మిగులుగా ఉన్న ప్రాంతాల నుండి లేని ప్రాంతాలకు మళ్ళించటం గురించిన చర్చ భారతదేశంలో చాలాకాలంగా కొన సాగుతున్నది. వీటిల్లో చాలా ముఖ్యమూ స్పష్టంగా రూపకల్పన చేయబడింది డా॥ కె.యల్.రావుగారి గంగా-కావేరి పునస్సంధానం ఎక్కువగా చర్చించబడినది. కేంద్ర నీటి వనరుల మంత్రిత్వశాఖ మరియు కేంద్ర జలసంఘం రూపకల్పనచేసిన నీటివనరుల అభివృద్ధి కోసం జాతీయ దృక్కోణ ప్రణాళిక. ఇంకా అనేకుల రాజకీయ, వృత్తిపర, సాంకేతిక మరియు డాంబికులు ప్రతిపాదించిన స్కీములు అనేకం వున్నాయి.

మొదటి మూడు తప్పితే మిగిలినవన్నీ ఉత్త భావాలు మటుకే. అవన్నీ ఎక్కువ భాగం ఆవేశపూరితమైనవి. ఆచరణకు చాలా దూరమైనటువంటివి. వాటికి సాంకేతిక, ఆర్థికపరమైన పట్టింపులే వున్నట్టుగా లేవు. ఈ ప్రతిపాదనలన్నీ కూడ నిరంతర కరువుకాటక పరిస్థితుల నుండే ఉద్భవించినాయి.

అంతర్నది సంధానం వల్ల వరదప్రాంతాల నీటిని క్షామపీడిత ప్రాంతాలకు మళ్ళించటం వల్ల ఒకే బాణంతో రెండు పిట్టలను కొట్టినట్లుగా వుంటుంది. ఇది పాక్షికంగా మాత్రమే సరైంది. కరువు వరకు సరైందే. నీటి మళ్ళింపుల వల్ల వరద ప్రాంతాలమీద పెద్దగా ప్రభావమేమీ వుండదని ఇపుడిపుడే గుర్తిస్తున్నారు. వరదలతో పోల్చి చూచినట్టయితే మళ్ళింపునీరు లెక్కలోనిదే కాదు. పాట్నావద్ద గంగ సాంవత్సరిక సరాసరి ప్రవాహం 1. 30,000 క్యూబిక్ మీటర్లు= 10,59,440 ఘనపు అడుగులు 2. 1500 క్యూబిక్ మీటర్లు= 52,972 ఘనపుటడుగులు నీటిని మళ్ళించడం ద్వారా దానిప్రభావం పాట్నావద్ద గంగ వరదల్లో పెద్ద ప్రభావమేమీ వుండబోదు. జోగిగోపవద్ద బ్రహ్మపుత్ర వరద ప్రవాహం 60,000 క్యూబిక్ మీటర్లు విడుదలయ్యే నీరు 3000 క్యూబిక్ మీటర్లు మాత్రమే. మణిభద్ర వద్ద మహానది సరాసరి ప్రవాహం 3. 24,300 క్యూబిక్ మీటర్లు= 85,8147 ఘనపుటడుగులు, విడుదలయ్యే నీరు 4. 600 క్యూబిక్ మీటర్లు=21,189 ఘనపుటడుగులు. ప్రతిపాదింపబడిన విడుదలయ్యే నీటివల్ల పై నదుల వరదలలో పెద్ద మార్పేమీ వుండబోదు. వరదల ప్రాంతాల నుండి కరువు పీడిత ప్రాంతాలకు నీటిమళ్ళింపు పథకాలకు ముగింపు పలకవలసిన సమయం ఆసన్నమైందనే సంగతిని రాజకీయ నాయకులు, ప్రజలు గుర్తించటం మంచిది.

మళ్ళింపుల వల్ల కరువు ప్రాంతాలకు సహాయకారిగా వుంటుందనేది నిర్వివాదాంశం. ఈ మళ్ళింపు ప్రతిపాదనల గురించి దేశం ముందుకుపోయే సందర్భంలో వాటి ఆవశ్యకత, ఆచరణ సాధ్యాసాధ్యాలను గూర్చి ఆలోచించాలి.

అంతర్ నదీ నీటి ప్రవాహపు మళ్ళింపుల ద్వారా నీటిపారుదల సామర్థ్యం పెరిగి ఆహార ఉత్పాదన మెరుగయ్యే అవకాశం కూడా వుంది. మన ప్రస్తుత, భవిష్యత్ ఆహారోత్పత్తుల అవసరం ఎంత? జనాభా పెరుగుదల బట్టే ఇది వుంటుంది.

సంవత్సరం	జనాభా ఆవశ్యకత కోట్లల్లో	ఆహారధాన్యాల (మి.టీ. టన్నుల్లో)
1980	80	200
2000	100	250
2010	120	300
2025	150	37
2050	185	460

(జనాభా 185 కోట్ల వద్ద ఆగుతుందని ఆశిద్దాం)

ఆర్థిక పరిస్థితి మెరుగయ్యే కొద్దీ వినియోగపు స్థాయి కూడా పెరుగుతుందనేది నిస్సందేహం. ప్రస్తుతం వున్న సాంవత్సరిక 250 కి.గ్రా. తలసరి అవసరం పెరుగుతుందని ఆశించటం తప్పేమీకాదు. పెరిగే ఆర్థిక స్థితిగతులు ఆహారపుటలవాట్లల్లో కూడ మార్పులు తీసుకొస్తాయి. పప్పుధాన్యాలు తగ్గి వినియోగం పెరుగుతుంది.

2010 నాటికి మనం 113 మిలియన్ హెక్టార్ల సేద్యపునీటి సామర్థ్యాన్ని కలిగి వుండగలమని అంచనా. ఇందులో 73 మిలియన్ హెక్టార్లు ఉపరితల జలం. 40 మిలియన్ హెక్టార్లు భూగర్భ నీరు. ఈవిధంగా మనదేశ పూర్తి సేద్యపునీటి సామర్థ్యం 113 మిలియన్ హెక్టార్లు.

1972 నాటి జాతీయ వ్యావసాయక కమిటీ అంచనాల ప్రకారం మనదేశంలో పంటభూమి 145 నుండి 175 మిలియన్ హెక్టార్ల మధ్య వుంది. 2025 నాటికి ఇది 155 నుండి 210 మిలియన్ హెక్టార్లు పెరగవచ్చు. కాని ఇది అంత సులభంగా కనబడటంలేదు. పెరుగుతున్న జనావాస దృష్ట్యా ఇది సాధ్యం కాకపోవచ్చు. 8వ ప్రణాళిక వర్కింగు గ్రూపు అంచనా వేసినట్లుగా ఇది 150 నుండి 180 మిలియన్ హెక్టార్ల మధ్య వుండొచ్చు.

ప్రస్తుతం ఆహార ధాన్యాల ఉత్పత్తి నీటిసాగు భూమిలో హెక్టారుకు 2.5 టన్నులుగాను, మెట్టభూమిలో 0.5 టన్నులుగాను వుంది. 2010 నాటికి 300 మిలియన్ టన్నులుగా వుండాలి. మెరుగైన వ్యావసాయిక, సేద్యపునీటి పద్ధతులు, నీటి నిర్వహణ వల్ల దేశ ఆహార ధాన్యాల ఉత్పత్తి 2010 నాటికి 400 మిలియన్ టన్నులకు పైనే వుండొచ్చు.

మొత్తం సాగవుతున్న భూమి ఆహారపు పంటలు పండేదికాదు. 113 మిలియన్ హెక్టార్ల సామర్థ్యంలో 75% నమ్మకమైంది. ఈ సామర్థ్యం ఒక్క క్షామ సంవత్సరంలో తగ్గుతుంది. రెండు అంతకన్న ఎక్కువ సంవత్సరాలు కరువు కొనసాగినట్లయితే ఈసామర్థ్యం బాగా సన్నగిల్లుతుంది. భారతదేశంలో కరువులు అవి మామూలు అన్న సంగతి అందరికీ తెలిసిందే. కరువు నీటిపారుదల సేద్యంకన్నా మెట్ట సేద్యంమీద అధికప్రభావాన్ని కలగజేస్తుంది. అన్నిఅంశాలను దృష్టిలో వుంచుకొని పరిశీలించి చూసినప్పుడు 2010 నాటి సాంవత్సరిక ఆహారోత్పత్తి 300 మిలియన్ టన్నులకు దగ్గరగా వుంటుందే గాని 400 దగ్గరికి రాదు. దేశ అవసరాల దృష్ట్యా చూసినప్పుడు 2010 వరకు అంతర్ జల సంధాన ఆవశ్యకత లేదు.

ఏ లెక్కన చూసినా హెక్టారుకు 3 టన్నుల ఆహారోత్పత్తి (నీటిపారుదల వ్యవసాయంలో) చాలా తక్కువ. దీన్ని ప్రధాన నీటిపారుదల పద్ధతులు, సరైన నిర్వహణ - సరైన వ్యావసాయక ఆర్థిక పద్ధతులు, పాటింపు - మెరుగైన నీటి నిర్వహణ - మేలైన విత్తనాల సరఫరా - ఎరువులు, పురుగుమందుల సరఫరా - సామర్థ్యపు నిల్వ కొనసాగింపు పూర్తి వినియోగం ద్వారా పెంచవచ్చు.

ఈ పద్ధతుల వల్ల దేశపు నీటిపారుదల ప్రాంతంలో ఉత్పాదన హెక్టారుకు 3.5 టన్నులు, ఆహార ధాన్యాల ఉత్పత్తి 400 మిలియన్ టన్నులకు పెరగగలదు. నమ్మకపు ప్రాధాన్యత, కరువు మొదలైన వాటి ప్రభావాల దృష్ట్యా 2025 నాటి దేశ ఆహారపు ధాన్యాల ఉత్పత్తిలో కొంత కొరత వుండొచ్చు. ఈ కొరతను పూడ్చుకోవటానికి అంతర్ జలసంధుల ఏర్పాటు అవసరం.

ఇప్పుడు అసలైన సమస్య 2025 తర్వాత 460 మిలియన్ టన్నుల అవసరాన్ని సాధించేదెలా? ఇందుకు ప్రత్యామ్నాయ మార్గాలు. 1. జనాభాను అరికట్టడం 2. ఆహారపు అలవాట్లలో మార్పు 3. ఉత్పాదనా పెంపు 4. సేద్యపు భూభాగాన్ని అధికం చేయటం.

1. జనాభాను అరికట్టడం :

ఏ అభివద్ధికైనా ప్రత్యేకించి నీరు, వ్యవసాయానికి సంబంధించిన ప్రణాళిక జనాభా పెరుగుదలను బట్టి వుంటుంది. 2025 నాటి భారతదేశ జనాభా 150 కోట్లకు 2050 నాటికి 185 కోట్లకు చేరుకుంటుందని అంచనా. అక్కడితో స్థిరీకరింపబడు తుందనే ఆశ. మానవశక్తిని ఒక ప్రధానమైన కారకంగా ఎంచుతారు. ఇవి పాక్షికం మాత్రమే కొంతవరకే సత్యం. జనాభా తన పరిధిలో ఉన్నంతకాలం ఇది సత్యం. భారతదేశం లాంటి అధిక జనాభా కలిగిన దేశాల్లో పెరిగే జనాభా తలసరి ఆదాయం మీద పెద్ద బరువుగా వుంటుంది. దానికి తగిన వస్తుత్పత్తి కాకపోయినట్టయితే అందువల్ల అధిక జనాభా పేదరికానికి దారితీస్తుంది. అభివృద్ధికి సంబంధించిన విభాగాల్లోని అసమానతలకు ఇదే మూలకారణంగా వుంటుంది. జనాభా పెరుగుదల తగ్గుముఖంలో వున్నదన్నది గమనార్హం. లేకపోయినట్టయితే ఏ రకపు అభివృద్ధి అయినా పేదరికాన్ని నిర్మూలించటం అసాధ్యం. ప్రజల ప్రాథమిక అవసరాలు తీరవు.

ప్రణాళికలో జనాభాను అరికట్టటం ప్రథమ ప్రాధాన్యతగా వుండాలి. ఒక మోస్తరు విజయమైనా సేద్యపు విస్తరణలో ప్రాముఖ్యత కలిగివుంటుంది.

2. ఆహారపుటలవాట్లలో మార్పు

చెయ్యటం కన్నా చెప్పటం చాలా సులువు. అన్ని జీవరాసుల మాదిరిగానే మానవుడు కూడ అలవాట్ల సృష్టికర్త. కూరగాయలు, పండ్లు, పాలు, కోళ్ళు, మాంసం మొదలైన వాటి ఉత్పత్తిని పెంచి వినియోగంలోకి తేవటానికి ప్రయత్నం చేయాలి.

3. ఉత్పత్తి పెంచటం

అంతర్జాతీయ స్థాయితో పోల్చి చూసినట్టయితే భారతదేశంలో వ్యవసాయక ఉత్పత్తి చాలా తక్కువ. దీన్ని పెంపుచేసే అవకాశం వుంది. పై పేరాల్లో చెప్పిన ప్రకారం అత్యంత ఆధునిక సాంకేతిక పద్ధతులు మనదేశంలోకి ఎప్పుడో ఒకప్పుడు ప్రవేశించక తప్పదు. నీటిపారుదల భూముల్లో హెక్టారుకు 4 మిలియన్ టన్నులు, మెట్ట భూముల్లో హెక్టారుకు 1 మిలియన్ టన్నుల ఉత్పాదన ఆహారోత్పాదనను 450 మిలియన్ టన్నులకు చేర్చగలదు. పనికొచ్చే పరిశోధనకు ఖర్చుపెట్టటం సరైనదే. కరువులు, ఆహారోత్పత్తులు కానటువంటి వాటికి ఖర్చు కొరతలో కొనసాగుతుంది. అంతర్ జలసంధి పద్ధతుల వల్ల కొంత భాగానికి నీటిపారుదల సౌకర్యం కల్పించవచ్చు. 2050 నాటికి కొంతమేరకు ఆహారోత్పత్తిలోని కొరత తీర్చవచ్చు.

4. నీటిపారుదల ప్రాంత పెంపు

దీన్ని ఎట్లా సాధించటం? అంతర్ జలసంధి సుదీర్ఘ మార్గమే పరిష్కారమా? ఇదొక మార్గం మటుకేగాని ఇదే మార్గం కాదు.

ఒక పంటకు ఒక మిలియన్ నీటి ప్రాతిపదికన 113 మిలియన్ హెక్టార్ల నిర్ణయానికి రావటం జరిగింది. సరైన నీటి నిర్వహణ, అమలుద్వారా దీన్ని కొంతవరకు తగ్గించవచ్చు. నూతన పద్ధతులైన స్ప్రింక్లర్, డ్రిప్ పద్ధతుల ద్వారా నీటిని ఆదా కాబడిన నీటితో నీటిపారుదల సామర్థ్యాన్ని పెంచవచ్చు. 6 శాతం పెరుగుదల ద్వారా 120 మిలియన్ హెక్టార్ల సామర్థ్యాన్ని చేరుకోవచ్చు. దీంతో పాటు అంతర్‌నదీ జలసంధుల లభ్యమయ్యే నీటిలభ్యతను చూద్దాం.

- డా॥ కె.యల్.రావుగారు ప్రతిపాదించిన గంగా-కావేరి లింకుద్వారా 150 రోజుల్లో 50,000 క్యూసెక్కుల ప్రవాహం అనగా నీటి పరిమాణం=648 టి.యం.సి.లు=648 శతకోటి ఘనపు అడుగులు నీటిని సరఫరా చేయొచ్చు. ఇది 2 మిలియన్ హెక్టారుకు నీటిపారుదల సౌకర్యం కలిగిస్తుంది.
- యన్.డబ్ల్యు.డి.ఎ. అంచనా మేరకు గోదావరిలో 20,000 మిగులు వుంటుంది. ఇది 2 మిలియన్ హెక్టారుకు పనిచేస్తుంది.
- మహానదిలో 8,000 యం.యం. మిగులు వుంటుందని అంచనా. 0.8 మిలియన్ హెక్టార్ల సామర్థ్యం కలిగిస్తుంది.
- కెన్‌లో 1100 యం.యం. మిగులు వుంటుందని అంచనా. 0.11 మిలియన్ హెక్టార్ల సామర్థ్యం.
- పర్-తపి 0.10 మి.హె.
- పంబ-అచన్ కోవిల్-వాగై 0-10 మి.హె.

పై అన్నింటిని మొత్తం 5.11 మి.హె. మొత్తం సామర్థ్యంలో ఇది 5 శాతం తక్కువే. అందువల్ల అంతర్ జలసంధుల వల్ల కలిగే ప్రయోజనం కన్నా, నదీ పరీవాహక ప్రాంత ప్రయత్నాలే లాభదాయకం. ఏ కొద్ది మార్పులవల్లో కొంత ఆహారోత్పత్తిని పెంచవచ్చు. ఇది కరువుల కాలాల్లో కొరతను కొంతవరకు పూడుస్తుంది.

అంతర్ జలసంధి పద్ధతుల్లోని సాధ్యాసాధ్యాలు

నీటిని సుదీర్ఘంగా పంపటంలో సాంకేతిక ఇబ్బందులేవీ లేవు. ఏమైనావుంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆ ఇబ్బందుల్ని అధిగమించగలదు. వరదకాలంలో పేరుకుపోయిన పూడికే పెద్ద సమస్య. నీటి సంబంధ వ్యవహారాల్లో లభ్యమవుతున్న అభివృద్ధి దీన్ని అధిగమించగలదు. ఉన్నత తవ్వకాలు, ఎత్తయిన ఒడ్లు, పొడవైన నదీ దాట్లు, ఆవిరి నష్టాలు మొదలైనవి మరికొన్ని చిక్కు సమస్యలు. కాని వీటికి పరిష్కారాలున్నాయి. సమస్యలు సాంకేతిక దిశనుండి కన్నా, పరిసర శాస్త్రవేత్తల నుండే వుంటాయి. సర్దార్ సరోవర్, నర్మదాసాగర్, తెహ్రి అనుభవాలు మన ముందున్నాయి.

పై గణాంకాలన్నీ ప్రస్తుతానివే. చివరి 3 కాలంలలోని అంకెలు సమయానుకూలంగా పెరగొచ్చు. ఆనకట్టలు చేపట్టేందుకు ఇవే ఇబ్బందికరం గావొచ్చు. బోధ్‌ఘాట్ చేపట్టగలిగినప్పుడు ఇచ్చంపల్లి సాధ్యం కాదా? అంతర్జాతీయంగా ప్రస్తుత వాతావరణ కాలుష్యం, పరిసర ప్రభావాల గురించి పెరుగుతున్న పరిజ్ఞానం గమనంలో వుంచుకుంటే ఇచ్చంపల్లి, మణిభద్రలను ఆశించగలమా? అవే లేకపోయినట్టయితే మహానది, గోదావరి నీటి మళ్ళింపుల గురించి ఆలోచించటంలో అర్థమేలేదు.

(మిగతా వచ్చే సంచికలో)

రాబోయే సంచికలో

ఆంధ్రదేశం-అప్పుల కుప్ప (ప్రత్యేక వ్యాసం)